ప్రభుత్వం మారినా..
అవే విధానాలు 7
» హామీలు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం : సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు
కార్యాలయం కూల్చివేతపై సీఎం దృష్టికి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



పెదపాలపర్రు రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న సిసోడియా, వేదికపై ఎమ్మెల్యే కామినేని

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

» సమస్యలు పరిష్కారమయ్యే వరకు రెవెన్యూ సదస్సులు
» ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియా

ముదినేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులకు కాల పరిమితి ఏమీ లేదు. రాష్ట్రంలో భూముల సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారమయ్యే వరకు సదస్సులను నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. సదస్సుల్లో వస్తున్న అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తా'మని ఏపీ ప్రభుత్వ రెవెన్యూ, భూ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా తెలిపారు. పెదపాలపర్రులో శుక్రవారం జరిగిన మీ భూమి - మీ హక్కు రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ లోప భూయిష్ఠమైన రీ సర్వే వల్ల పలుచోట్ల తప్పులు దొర్లాయని వాటిని సరి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేవదాయశాఖ, మాజీ సైనికోద్యోగులు, రాజకీయ బాధితులు, అసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలోని వడాలి జగన్నాథ స్వామి ఈనాం భూములు, మద్రాసు రంగనాథ స్వామి దేవస్థానం భూములు, ఉనికిలి, వైవాక డీ-ఫారం భూముల సమస్య, కొల్లేరు జిరాయితీ భూములు సమస్యను పరిష్కరించాలని కోరారు. జేసీ ధాత్రి రెడ్డి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, తహసీల్దార్ సుభానీ, ఎంపీడీవో వై.రామకృష్ణ, సర్పంచ్ గంటా రాకేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా ముదినేపల్లి మండలం కోడూరులో తనకు గల 31 సెంట్ల భూమిని వైసీపీ నాయకులు బొప్పన ప్రసాద్, వెంకటేశ్వరరావు ఆక్రమించి తనను సాగు చేయకుండా అడ్డుపడుతున్నారని పెదపాలపర్రుకు చెందిన బొప్పన ధనలక్ష్మి అనే మహిళ రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకు వినతిపత్రం అందజేసింది. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన తహసీల్దార్‌ను ఆదేశించారు.

31వ తేదీ నుంచే జనవరి పింఛన్ల పంపిణీ

ఏలూరు సిటీ, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను ఈనెల 31 వతేదీ నాడే పంపిణీ చేయడానికి జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. జనవరి 1వ తేదీ సెలవుదినం కావడంతో ఈ పింఛన్‌లను డిసెంబరు 31 వ తేదీనే పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత నెల మాదిరిగానే సచివాలయ సిబ్బంది, ఇతర ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి అందిస్తారుఒక వేళ ఏదేని కారణాల వల్ల డిసెంబరు 31 వ తేదీన అందుకోని వారికి జనవరి 2న అందజేస్తారు.



సెప్టెంబరులో కృష్ణ కాల్వకు గండిపడడంతో పెదపాడు మండలం కడిమికుంట పంచాయతీలో చెరువును తలపిస్తున్న పంటపొలాలు (ఫైల్)

అన్నదాత.. సుఖీభవ!



రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కంకణం

» ఈ ఏడాది మొదటి ఆరునెలలు కష్టాల కడలిలో రైతులు
» రైతుల సంక్షేమం పట్టని వైసీపీ ప్రభుత్వం
» కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధాన్యం బకాయిలు చెల్లింపు
» రైతులను ఇబ్బంది పెట్టిన వర్షాలు.. వరదలు

జ్ఞాపకాలు 2024

వ్యవసాయానికి జవసత్వాలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం రాకతో రైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. గత ఐదేళ్ల నుంచి పడ్డ కష్టాలకు కూటమి ప్రభుత్వం రాకతో విముక్తి లభించింది. ఆరుగాలం శ్రమించినా గత ప్రభుత్వ హయాంలో ఎటువంటి ఫలితం లభించలేదు. కొందరు రైతులయితే వ్యవసాయం గిట్టుబాటు కాక వేరే రంగాలకు వలస వెళ్లిపోయారు. ఈ ఏడాది ప్రకృతి కూడా రైతన్నతో దోబూచులాడింది. రైతన్నలు ఎదుర్కొన్న ఒడిదుడుకులను ఓసారి మననం చేసుకుందాం.

ఏలూరు సిటీ, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయానికి వైసీపీ ప్రభుత్వం అంతంత మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడం, వ్యవసాయంలో కొత్త విధానాలు తీసుకొచ్చినా రైతు లాభపడేలా వ్యవహరించక పోవడంతో రైతులు ఆర్థిక నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఆర్‌బీకేల వ్యవస్థను ఏర్పాటు చేసినా అనుకున్న లక్ష్యాలను సాధించలేదు. ఎరువులు ఇంటి చెంతకే వస్తాయని చెప్పినా అదీ చేయలేకపోయారు. ధాన్యం కొనుగోలు విషయంలో గతేడాది రైతులు పడిన కష్టాలు అన్నీ ఇన్నీ కావు. ధాన్యం కొనుగోలులో తేమ శాతం నిబంధన పేరిట రైతులకు చెల్లించే సొమ్ముల్లో కోత విధించడంతో రైతులు పూర్తిగా నష్టపోయారు. దగ్గరలో ఉన్న రైస్ మిల్లులకు ధాన్యాన్ని తరలించకుండా సుదూర ప్రాంతాలకు ధాన్యాన్ని తరలించడంతో రైతులకు రవాణా ఖర్చులు అధికమయ్యి ఇబ్బందులు పడ్డారు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో సొమ్ములు రైతులు బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా అది అమలు కాలేదు. ధాన్యం కొనుగోలులో గోనెసంచులు సకాలంలో అందించకపోవడం, అదీగాక చినిగిన సంచులు ఇవ్వడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. ఈ లోగా ఎన్నికలు రావడంతో రైతులు బకాయిలు కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధాన్యం బకాయిలను రైతులకు చెల్లించారు.

సబ్సిడీల ఊసేలేదు

వ్యవసాయానికి గత ప్రభుత్వం అంతంత మాత్రంగానే ప్రాధాన్యం ఇచ్చింది. డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. వ్యవసాయ సబ్సిడీలను పూర్తిగా ఎత్తివేసింది. పండ్ల తోటలకు రాయితీలు లేక ప్రోత్సాహం కరువైంది. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇక కౌలు రైతులకు అంతంత మాత్రంగానే గత ప్రభుత్వం ప్రోత్సాహాన్ని ఇచ్చింది. జిల్లాలో 3.50 లక్షల మంది రైతులు ఉన్నారు. ఇందులో అధిక శాతం కౌలు రైతులో వాస్తవ సాగు దారులుగా ఉన్నారు. సకాలంలో రుణాలు అందక కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు రాక ఎన్నో ఇబ్బందులు ప డుతూ వ్యవసాయం చేశారు. రబీలో ఏ పంటకు ప్రోత్సాహం లేక అన్ని పంటల పరిస్థితి ఒకే రకంగా తయారైంది. దీనికి తోడు ప్రకృతి వైపరీత్యాల వల్ల రైతులు పంటలను నష్టపోవాల్సి వచ్చింది. ఉద్యాన పంటలదీ అదే పరిస్థితి. రైతు భరోసా విషయంలో, ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో, పంట నష్టపరిహారం విషయాల్లోను రైతులకు పూర్తి స్థాయిలో నిధులు కేటాయించపోవడంతో రైతులు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం.



పెదవేగి మండలం అమ్మపాలెంలో ధాన్యాన్ని కాపాడుకునేందుకు పాట్లు (ఫైల్)

కూటమి ప్రభుత్వం రాకతో జోష్

జూన్ వరకు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా జూలై మాసం నుంచి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికారంలోకి వచ్చీ రాగానే రైతులకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చి పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోంది. వరితో పాటు అన్ని పంటలకు, ఉద్యాన పంటలకు చేయూత ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గత ప్రభుత్వ హయాంలో పేరుకు పోయిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన రూ. 472 కోట్ల ధాన్యం బకాయిలను చెల్లించింది. ఇందులో ఏలూరు జిల్లాకు సంబంధించి రూ. 48 కోట్లు బకాయిలు రైతులకు చెల్లించింది. పీఎం కిసాన్ నిధులు జిల్లాకు సంబంధించి 98,945 మంది రైతులకు గత అక్టోబరు మొదటి వారంలో రూ.19.78 కోట్లు నిధులు విడుదల చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులు తమ ధాన్యాన్ని తాము ఎంపిక చేసుకున్న దగ్గరలోని రైస్ మిల్లుకు తరలించే ఏర్పాట్లు చేసింది. ప్రకృతి వైపరీత్యాలు వచ్చిన సమయంలో రైతులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం విస్తృత చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే 2024, సెప్టెంబరులో కురిసిన అధిక వర్షాలకు దెబ్బతిన్న వరి, మొక్కజొన్న, మినుము, పత్తి, వేరుశనగ పంటలకు పంట నష్టం నమోదు చేసి వారం రోజుల్లోనే 1259 మంది రైతులకు రూ.2.04 కోట్లు నష్టపరిహారాన్ని రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసింది.



ప్రోత్సాహకాలు ఇలా...

కూటమి ప్రభుత్వం పూర్తిగా రైతుల శ్రేయస్సు కోసం పనిచేస్తోంది. జిల్లాలో మండలానికి ఒక డ్రోన్‌ను ఏర్పాటు చేయడంతో పాటు కిసాన్ డ్రోన్‌లు 40 వరకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. మహిళలకు 20 దీదీ డ్రోన్‌లు ఇవ్వడానికి లబ్ధిదారు లను గుర్తించారు. ఉద్యాన పంటల సాగులో సాగు నీటి ఇబ్బందులు తొలగిపోవడానికి డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని పునరుద్ధరించింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 3,400 హెక్టార్లకు సంబంధించి పరిపాలన ఆమోదం తెలిపారు. ఇందులో డ్రిప్ ఇరిగేషన్ 3,100 హెక్టార్లు, స్ప్రింకర్లు 300 హెక్టార్లకు పరిపాలన ఆమోదం లభించింది. ఇందులో 2,400 హెకార్లకు సంబంధించి పరికరాలు బిగించారు. పొలంబడి, పొలం పిలుస్తోంది కార్యక్రమాల ద్వారా రైతుల్లో వివిధ పంటల సాగులో తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తోంది. మామిడి, జీడిమామిడి తోటల రైతులకు రాయితీలను కల్పించింది. జిల్లా పంట సాగుదారు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయటానికి 2024-25 సంవత్సరానికి 62,647 పంట సాగుదారు హక్కు పత్రాల లక్ష్యానికి ఇప్పటివరకు 53,942 మంది కౌలు రైతులకు పత్రాలను అందించి బ్యాంకుల్లో రుణాలు పొందే అవకాశం కల్పించారు. జిల్లాలో 16వేల 776 చోట్ల మట్టినమూనాలు, భూసార పరీక్షలు చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న రైతు ప్రోత్సాహక చర్యలు ద్వారా రైతుల మోములో ఆనందం వెల్లివిరుస్తోంది. గత ఐదేళ్ల పాటు కష్టాలు చవి చూసిన రైతులు ఇప్పుడు ఈ ప్రభుత్వం రాకతో తమ ఇబ్బందులు తీరుతున్నాయని చెబుతున్నారు.

ఆపరేషన్ సిద్ధ

'అక్కా.. బావ అప్పులపాలై ఇల్లు వది పారిపోవడానికి, అప్పులు వాళ్లు వచ్చి నిన్ను డబ్బుల కోసం వేధించడానికి కారణం మీకు ఎవరో చేతబడి చేశారట. అప్పులవాళ్లు ఇకపై శవాలను కూడా పంపిస్తారట.. మాకు తెలిసిన సిద్ధాంతి ఒకరు చెప్పారు' అంటూ అక్క తులసితో.. చెల్లెలు రేవతి అన్నమాటలివి..

అక్కకు శవాన్ని పంపించి భయపెట్టాలని రేవతి, శ్రీధర్‌వర్మ భావించారు. ఈ క్రమంలో రేవతి కోడ్ భాషలో 'వర్మా.. చేప దొరికిందా' అంటూ అడిగేది. చేప అంటే శవం అని అర్థం. ముందుగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి హత్యకు ప్లాన్ చేశారు. అది బెడిసికొట్టడంతో పర్లయ్యను బలి తీసుకున్నారు.

» క్రైం సినిమాను తలపించేలా సన్నివేశాలు.. » రోజుకో ట్విస్టుతో సస్పెన్స్ థ్రిల్లర్
» అక్క ఆస్తి కోసం శవంతో బెదిరించాలని చెల్లెలు, భర్త, ప్రియురాలు కలిసి కుట్రలు
» అమాయకుడు పర్లయ్య హత్య.. రెండు రోజులపాటు మృతదేహంతో కారులోనే
» తొమ్మిది రోజులపాటు గాలింపు.. ఎట్టకేలకు కటకటాల వెనక్కు ముగ్గురు

భీమవరం క్రైం/ఉండి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పచ్చని పాడి పంటలతో, ఎంతో ప్రశాంతంగా ఉండే జిల్లా పశ్చిమ గోదావరి. ఇలాంటి జిల్లాలోని ఉండి మండలం యండగండిలో ఈ నెల 19న ముదునూరి రంగరాజు నివాసానికి చెక్క పెట్టిలో మృతదేహాన్ని పెట్టి డోర్ డెలివరీ చేయడం సంచలనం సృష్టించింది. నేర చరిత్రలోనే ఇలాంటి ఘటన జరగడం ఇదే తొలిసారి కావచ్చు ! ఈ కేసు లోతుల్లోకి వెళ్లే కొద్దీ విస్తుబోయే, నమ్మలేని నిజాలు వెలుగుచూశాయి. 40ఏళ్లలో ఇలాంటి ఘటనలు ఎప్పుడూ చూడలేదని పోలీసులే చెప్పడం విశేషం.

అక్కా చెల్లెళ్లకు చెరో అర ఎకరం పొలాన్ని తల్లిదండ్రులు రంగరాజు, హైమావతి పంచి ఇచ్చారు. అయినప్పటికి పెద్ద కుమార్తె సాగి తులసికి వచ్చే ఆస్తిని కొట్టేయాలని పన్నాగం పన్నిన ఆమె చెల్లెలు రేవతి, భర్త శ్రీధర్‌వర్మ సహాయం తీసుకుంది. అతను తన ప్రియురాలు సుష్మతో కలిశాడు. ఈ ముగ్గురూ కలిసి శవంతో తులసి భయపెట్టి ఆస్తిని రాయించు కోవాలని అనుకున్నారు. ఇందుకు ఒక అమాయకుడిని కూలీ పని పనికి తీసుకుని వెళ్ళి హత్యచేశారు. రెండు రోజులపాటు ఆ మృతదేహాన్ని తమ పక్కనే ఉంచుకోవడం చూస్తుంటే వారు ఎంత కరుడుగట్టిన నేరస్తులో అర్థం చేసుకోవచ్చు. ఇంత క్రిమినల్ మైండ్‌తో (మిగతా 8లో)

వారిద్దరూ అక్కా, చెల్లెళ్లు. అక్క కష్టంలో అండగా ఉండాల్సిన చెల్లెలు తల్లిదండ్రుల ద్వారా ఆమెకు సంక్రమించే ఆస్తిని కాజేయాలని కుట్ర పన్నింది. ఇందుకు భర్త నేర స్వభావం కలిసి వచ్చింది. అక్కను శవాలతో భయపెట్టి.. ఆస్తిని లాక్కునే కుట్రను పన్నింది. ఇందుకు అన్నెం పున్నెం ఎరుగని ఓ వ్యక్తి బలయ్యాడు. వారం పాటు అటు పోలీసులకు, ఇటు ఆయా గ్రామాల ప్రజలకు ముచ్చెమటలు పట్టించి, రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' కేసు క్రైం సినిమాను తలపించింది. నిందితుల అరెస్ట్‌తో కేసు సుఖాంతమైంది.

- ప్రధాన వార్త మెయిన్‌లో



ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ
» ఎస్సీ వర్గీకరణ అనుకూల, వ్యతిరేక వర్గాలు భారీగా రాక 7
» ఏలూరు కలెక్టరేట్ ఎదుట నినాదాలు

కొత్త స్కూల్ కాంప్లెక్స్‌ల ప్రతిపాదనలపై సమావేశం

ఏలూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా జిల్లాలో ప్రతిపాదించిన 114 స్కూల్ కాంప్లెక్స్‌ల ఏర్పాటుకు అభ్యంతరాల స్వీకరణపై శుక్రవారం స్థానిక మండల వనరులకేంద్రంలో డీఈవో వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన ఎంఈవోల సమావేశం జరిగింది. జిల్లాలో ప్రస్తుతం ఉన్న 161 స్కూల్ కాంప్లెక్స్‌లస్థానే ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన ఫార్మ్యులా ప్రకారం మండలంలో ఉపాధ్యాయులు, జనాభా, విద్యార్థుల సంఖ్యను ప్రామాణికంగా తీసుకుని కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయనున్నట్లు డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు వివరించారు. ఆ ప్రకారం అన్ని వసతులువున్న హైస్కూళ్లలో 114 స్కూల్ కాంప్లెక్స్‌లను ఎంపికచేసి ప్రభుత్వానికి ప్రతిపాదించామన్నారు. ఒక్కో స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సంబంధిత మండలంలోని 50-60మంది ఎలిమెంటరీ, హైస్కూలు ఉపాధ్యాయులుండేలా చర్యలు తీసుకున్నామన్నారు. కొత్తగా కలిదిండి మండలంలో స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రతిపాదన వచ్చిందని, ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.







మార్కెట్లో కొత్త సంవత్సరం జోష్, సంక్రాంతి సందడి కనిపిస్తోంది. నగరం, పట్టణాల్లో వస్త్ర, బంగారు, రెడీమేడ్, షాపింగ్‌మాల్స్, హోమ్ అప్లెయిన్‌సెస్, వాహనాల షోరూమ్‌లు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. క్రిస్మస్ సందర్భంగా గడిచిన వారం రోజులు కొనుగోళ్లు బాగానే ఉన్నాయని, సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను పురస్కరించుకుని వ్యాపారాలు కొనుగోలు దారులను ఆకర్షించేందుకు ఆఫర్స్ ఇస్తున్నారు. సంక్రాంతి పండుగకు 20 రోజులు సమయం ఉండడంతో దుకాణాల్లో అమ్మకాలు కొనసాగుతున్నాయి.

కొనుగోలుదారులను ఆకర్షించే ఆఫర్స్ మేలు చేస్తాయా.. వ్యాపారులకు సిరులు కురిపించే మంత్రమా.. ఆలోచించాల్సిందే. ఆఫర్స్ వలలో పడితే జేబులు ఖాళీ అవుతాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. వ్యాపారులు ప్రకటించే ఆఫర్స్ కూడా అలాగే ఉన్నాయి. 2 ప్యాంట్లు రూ. వెయ్యి అని ఊదరగొడతారు. ఒక్కటే కొంటే రూ.650 ధర. అంటే రెండు విక్రయించిన వ్యాపారి రూ.300 నష్టపోయినట్లా.. రెండు ప్యాంట్లు కొనుగోలు చేసిన వినియోగదారు రూ.300 లాభపడినట్లా.. ఒక్క కొనుగోలులో ఇంత ధర వ్యత్యాసం ఉన్నపుడు ఆ వ్యాపారం ఎలా సాగుతున్నట్లు.. ప్రభుత్వ వ్యవస్థల నియంత్రణ లేదా అనే ప్రశ్నలు తలెత్తుతాయి. కొనుగోళ్లపై బహుమతులు, లక్కీడిప్‌లు ఒక ఎత్తయితే 1 నుంచి 5 వస్తువులు ఒకే ధర అని, విడివిడిగా మరొక ధర వసూలు చేయడం మోసమేనని పలువురు వాపోతున్నారు. వ్యాపారుల బహిరంగ ధరల మాయాజాలంపై సంబంధిత అధికారులు నిఘా ఉంచాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.



నరసాపురం పట్టణంలో రోడ్డుపై స్టాల్స్ వేసి ప్రత్యేక ఆఫర్లతో వస్త్ర విక్రయాలు.. కొనుగోలుదారుల రద్దీ

మార్కెట్ మాయాజాలం

పండుగ ఆఫర్స్

- ఒకటి కొంటే ఒకటి ఉచితం
- భారీ డిస్కౌంట్ ధరలు
- ప్రత్యేక బహుమతులు, లక్కీడిప్
- కొనుగోళ్లపై గిఫ్ట్ కూపన్స్
- నగరం, పట్టణాల్లో ప్రచార హోరు
- కొనుగోలుదారులను ఆకర్షిస్తున్న వ్యాపార ప్రకటనలు
- నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలకు ప్రత్యేక ఆఫర్లు

భీమవరం టౌన్ / ఏలూరు రూరల్ / నరసాపురం టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పండుగ సీజన్‌లో అమ్మకాలపై వ్యాపారులు ఆశలు పెట్టుకున్నారు. కొనుగోలు దారులను ఆకర్షించేందుకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటిస్తున్నారు. భీమవరం పట్టణంలో ప్రముఖ వస్త్ర వ్యాపార సంస్థ 1 ప్లస్ 1 ఆఫర్, కాంబో కొనుగోలుపై బహుమతులు ప్రకటించారు. షాపింగ్ చేసిన తరువాత గిఫ్ట్ కూపన్ ద్వారా వచ్చిన స్పాట్ బహుమతితో కొనుగోలుదారులు వెళుతున్నారు. మరొక షోరూమ్ 40 శాతం ఆఫర్‌తో అమ్మకాలు చేస్తున్నారు. దీంతోపాటు గిఫ్ట్‌స్కీమ్ పెట్టారు. వచ్చేనెల 13న లక్కీడిప్ ద్వారా విజేతలను ఎంపిక చేసి మొదటి బహుమతి రిఫ్రిజిరేటర్, రెండో బహుమతి వాషింగ్ మిషన్, మూడో బహుమతి కూలర్ ప్రకటించారు. ఇక్కడ కూడా స్పాట్ గిఫ్ట్ బహుమతిని ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా రడీమేడ్ వస్త్ర దుకాణాల్లో రూ.999 ధరకు 5 షర్టులు, రూ.999 ధరకు జత బట్టలు, 1ప్లస్ వన్ ఆఫర్లు వంటి ప్రత్యేక ఆఫర్లతో కొనుగోలు దారులను ఆకర్షించే ప్రయత్నంచేస్తున్నారు.

కొంత మంది వ్యాపారులు జనవరి 1 తరువాత ఆఫర్లను ప్రకటించే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. మరో షోరూమ్ ప్రత్యేక ఆఫర్ల ద్వారా వినియోగదారును ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. లక్కీడిప్ ద్వారా విజేతలకు బహుమతులు అందించేవిధంగా పండుగల ఆఫర్లను ఇచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ఆఫర్లు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా వ్యాపారాలు ఆఫర్లను ప్రకటిస్తున్నారు. దీంతో యువకులు ఇటువంటి ఆఫర్లతో కొనుగోలుకు సిద్ధం అవుతున్నారు.



భీమవరంలో ప్రత్యేక ఆఫర్లతో ఆకర్షిస్తున్న దుకాణం

నగరంలో సందడి

ఏలూరు నగరంలో షాపింగ్ మాల్స్, వస్త్ర దుకాణాలు అధికంగా ఉండే మెయిన్ బజారు, ఆర్‌ఆర్‌పేట తదితర ప్రాంతాలు సందడిగా ఉన్నా యి. సంక్రాంతి దుస్తులు కొనుగోలు కోసం ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వస్తుంటారని వ్యాపారులు చెబుతున్నారు. ఈ క్రమంలో సాధారణ రోజులతో పోలిస్తే వ్యాపారం నాలుగునుంచి ఐదురెట్లు అధికంగా జరుగుతుందని తెలిపారు.

కొనుగోలుదారులు చౌక అంటే పరుగులు తీస్తున్నారు. కొన్ని ద్విచక్ర వాహనాలపై రూ.2వేల నుంచి రూ.6 వేల తగ్గింపు ప్రకటించడంతోపాటు హెల్మెట్ ఉచితంగా అందజేస్తున్నారు. చెప్పుల నుంచి చీరలు, రెడీమేడ్ దుస్తులను రోడ్డుపై స్టాల్స్ పెట్టి ఆఫర్లతో విక్రయిస్తున్నారు. దీంతో జనం ఎగబడుతున్నారు. ఏ దుకాణం వద్ద ఎప్పుడు అఫర్ ఉంటుందోనని ఎదురుచూస్తున్నారు.

ప్రత్యేక ఆఫర్లతో ఆకట్టుకునే ప్రయత్నం

పండుగ సందర్భంగా నగరంలోని ప్రధాన వస్త్ర షాపింగ్ మాల్స్, వాహనాల షోరూమ్‌లు, బంగారు దుకాణాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయాల షాపులు ఆఫర్లు ప్రకటించాయి. ఈ ఆఫర్లు ఉన్న దుకాణాలకు తాకిడి అధికంగా ఉంటోంది. సంక్రాంతి పండుగ వ్యాపారంలో దాదాపు 60శాతం రెడీమేడ్ వస్త్రాలే. గతంలో పోలిస్తే ఆన్‌లైన్ విక్రయాలతో 15శాతం మేర విక్రయాలు తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఈ నెల రెండో వారం నుంచి పండుగ వ్యాపారం ఊపందుకుంది. దీన్నిదృష్టిలో పెట్టుకుని వ్యాపార సంస్థలు పోటాపోటీగా ఆఫర్లు ప్రకటించాయి. ఒకటి కొంటే ఒకటి ఉచితం, రూ.2వేలు విలువన వస్త్రాలు రూ.999, టీషర్ట్ రూ.200, రూ.3 వేల చీర రూ.వెయ్యి, రూ.10వేలు కొనుగోలుపై 30 శాతం, కొన్ని వస్త్రాలపై 70శాతం తగ్గింపు వంటి ఆఫర్లతో ఆకట్టుకుంటున్నారు. బంగారు ఆభరణాలపై తరుగు, మజూరి రాయితీలు, వెండి బంగారు కాయిన్‌లు గిఫ్ట్, గ్రాముకు రూ.300 తగ్గింపు ప్రకటిస్తున్నారు. ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌పై 30 నుంచి 50 శాతం వరకు డిస్కౌంట్లు ఇచ్చి వినియో గదారులను ఆకర్షిస్తున్నాయి. పండుగల ఆఫర్లకు ఎదురుచూసేవారు ఉండడంతో ప్రస్తుతం వ్యాపారం జోరుగా సాగుతోంది.



ఏలూరులో ఆకర్షించే పండుగ ఆఫర్లు

ఏలూరు నగరంలో చిన్న, పెద్ద వస్త్ర దుకాణాలు సుమారు 70 వరకు ఉంటాయి. ఏలూరు వన్‌టౌన్, టూటౌన్‌లో సుమారు 400 పైగా బంగారం షాపులు ఉన్నాయి. 5 మాల్స్ ఉన్నాయి. పండుగ వస్తుందంటే వీటన్నింటికి డిమాండ్ ఎక్కువే. దీంతో వ్యాపారులు భారీ ఆఫర్లు పెట్టి క్యాష్ చేసుకుంటున్నారు.



ఏలూరు నగరంలోని వస్త్ర దుకాణంలో 1 ప్లస్ 1 ఆఫర్

తగ్గింపు ధరలు

నరసాపురం పట్టణంలో పండుగ ఆఫర్లతో మార్కెట్‌లు కిటకిటలాడుతున్నాయి. వ్యాపారులు ఆఫర్ల వల విసురుతున్నారు. కొంతమంది వ్యాపారులు ఆదివారం మాత్రమే విక్రయాలు సాగిస్తున్నారు. ఏటా ఈ సీజన్‌లో అమ్మకాలు జరపడం సర్వ సాధారణం. చెప్పుల వ్యాపారుల స్టాక్ క్లియరెన్స్ సేల్ పేరిట విక్రయిస్తున్నారు. ఖరీదైన చెప్పులు రూ.200 నుంచి రూ.300 ధరకు విక్రయిస్తున్నారు. దుకాణం వద్ద టెంట్ వేసి స్టాక్ గుట్టల గుట్టలుగా ఉంచుతున్నారు. రూ.100 నుంచి రూ.200, రూ.300, రూ.500 ధరకు విక్రయిస్తారు. ప్రముఖ కంపెనీల షూస్ కూడా ఉన్నాయి.

రెడీమేడ్ వస్త్ర దుకాణాల్లో రద్దీ

రెడీమేడ్ వస్త్రాలపై వ్యాపారులు అనూహ్య ఆఫర్లు ప్రకటిస్తున్నారు. రెండు జీన్స్ రూ.వెయ్యి, మూడు జీన్స్ రూ.వెయ్యి, ఐదు చొక్కాలు రూ.వెయ్యి చొప్పున విక్రయాలు జరిపారు. పిల్లల దుస్తులకు మరిన్ని ఆఫర్స్ ప్రకటించారు. ఇక చీరలకు చెప్పవనసరం లేదు. ప్రతి షాపు వారంలో ఒక రోజు క్లియరెన్స్ సేల్స్ అంటూ 5 చీరలు రూ.వెయ్యి, కొన్ని రకాల చీరలు పది విక్రయించారు. ఖరీదైన చీరలపై భారీ డిస్కౌంట్ ప్రకటించారు. క్రిస్మస్, కొత్త సంవత్సరం, సంక్రాంతి పండుగలకు ప్రత్యేక ఆఫర్లతో ఊరిస్తున్నారు.



అతడే బాస్!

- ఐఏఎస్‌ల అండదండలున్నాయంటూ ఆగడాలు
- ఏళ్ల తరబడి అదే కార్యాలయంలోనే తిష్ట.. ప్రశ్నిస్తే వేధింపులు
- జిల్లా అధికారులు, కార్యాలయ సిబ్బంది అతడికి జై అనాల్సిందే!
- సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో విలాసాల చిరుద్యోగి లీలలు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాకార్యకలాపాల పర్యవేక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, తదితర ప్రభుత్వ ప్రాధామ్యాల అమలుకోసం జిల్లా విద్యాశాఖకు అనుబంధంగావున్న సమగ్రశిక్ష జిల్లా కార్యాలయ నిర్వహణ అసమగ్రంగా, అస్తవ్యస్తంగా తయారైంది. కీలకవిభాగాల్లో పర్యవేక్షణ కొరవడగా, ఓ చిరుద్యోగి మొత్తం కార్యాలయాన్నే తన గుప్పెట్లో పెట్టుకుని పెత్తనంచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలకు విరుద్ధంగా రికమండేషన్లతో డిప్యూటేషన్లపై కీలక పోస్టుల్లో కొనసాగడమేగాక, కార్యాలయంలో మిగతా అధికారులు, ఉద్యోగ సిబ్బందిపై పెత్తనం చేయడం, మరికొందరిపై వేధింపులకు పాల్పడు తూ బెదిరింపులకు దిగడం పరిపాటి అయింది.

ఏలూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ కార్యాలయ బాస్‌లా వ్యవహరిస్తున్న ఉద్యోగిని ప్రశ్నించినవారిపై రాష్ట్ర ప్రాజెక్టు కార్యాలయానికి ఫిర్యాదులు, నైతిక విలువలను దిగజార్చేలా ఉన్నతాధికారుల వద్ద ఆరోపణలతో విద్యాశాఖ జిల్లా అధికారులే బెంబేలెత్తిపోతున్నారు. ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకుందామన్నా గంటల వ్యవధిలోనే నేరుగా ఐఏఎస్ అధికారుల నుంచే ఫోన్లు వస్తుంటాయని, వారి మద్దతు ఉండడం వల్లే అడుగుముందుకు వేయడానికి భయపడుతున్నట్టు సమాచారం.

నోటిఫికేషన్లకు మోకాలడ్డు!

సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టులో కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి(సీఎంవో) పోస్టు చాలా కీలకం. విద్యార్థులకు విద్యా కానుక కిట్లు, పేరెంట్, టీచర్ సమావేశాలు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)ల సమావేశాల పర్యవేక్షణ తదితర కార్యకలాపాలు సీఎంవో పర్యవేక్షణలోనే కొనసాగుతాయి. ఈ పోస్టు ఏడాదిన్నర కాలంగా ఖాళీగా ఉంది. ఇన్‌చార్జి సీఎంవోగా ఎంఈవో-2 వ్యవహరిస్తున్నారు. ఏకకాలంలో రెండు బాధ్యతల నిర్వహణ సాధ్యం కాదని సీఎంవో ఖాళీ భర్తీ చేయడానికి పలుమార్లు నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఇంతవరకు భర్తీ చేయలేకపోయారు. దీనిపై ఆరాతీస్తే ఆశ్చర్యంగొలిపే పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. కనీసం అసిస్టెంట్ సెక్టోరల్ ఆఫీసర్ నియామకానికి కూడా అర్హతలేని ఒకరికి అప్పటి వైసీపీ ప్రభుత్వంలో ఒక మంత్రి రికమండేషన్‌తో కార్యాలయంలో డిప్యూటేషన్‌పై పోస్టింగ్ ఇచ్చారు. నిబంధనలకు విరుద్ధమని ప్రచారం సాగినా అప్పటి నుంచి ఆ ఉద్యోగి కార్యాలయంలో తిష్ఠవేసి బాస్‌లా వ్యవహరిస్తున్నాడు.

అవినీతి ఆరోపణలు

అవినీతికి పాల్పడ్డారని కార్యాలయ ఫైనాన్స్ విభాగం పూర్వపు డీఈవో దృష్టికి తీసుకెళ్లింది. ఏజెన్సీ ప్రాంతంలో బాలికల పాఠశాలల ఆధునికీకరణకు, వివిధ మరమ్మతు పనులకు ప్రభుత్వ నిధులను కాజేసినట్లు ఆరోపణలు వచ్చాయి. బాలికల పాఠశాలల్లో షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరుచేసిన నిధులపై కన్నేసి పనులను పేరెంట్స్ కమిటీల మాటున సొంతంగా చేపట్టడానికి ప్రయత్నించాడు. జిల్లా ఉన్నతాధికారి దృష్టికి వెళ్లడంతో పనులు రద్దుచేయడం గమనార్హం.

కాలపరిమితి ముగిసినా..

సమగ్రశిక్షలో కాలపరిమితి పూర్తయినప్పటికీ అదే పోస్టులో కొనసాగుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోన్న సదరు ఉద్యోగి డిప్యూటేషన్‌ను రద్దు చేసి స్కూలు విధులకు పంపించేందుకు ఉన్నతాధికారుల ఉత్తర్వులతో పూర్వపు డీఈవో ఆదేశాలు జారీచేశారు. కానీ రోజుల వ్యవధిలోనే హైలెవెల్ రికమండేషన్లతో మళ్లీ కార్యాలయంలో కొనసాగేందుకు ఆర్డర్ తెచ్చుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. నిబంధనల ప్రకారం సమగ్ర శిక్షలో గరిష్ట డిప్యూటేషన్‌కాలం ముగిసిన వెంటనే రిలీవ్‌చేసి వెనక్కి పంపించడంతోపాటు, మళ్లీ కార్యాలయంలో పోస్టింగ్ పొందడానికి కనీసం ఆరునెలలు వ్యవధి ఉండాలి. ఈ సాంకేతిక వెసులుబాటును ఉపయోగించుకుని ఇపుడు సీఎంవో పోస్టును తనకున్న ఉన్నతస్థాయి అందదండలతో పొందేందుకు ఆ ఉద్యోగి చేస్తున్న ప్రయత్నాలు చివరకు జిల్లా అధికారులనే శాసించేస్థాయికి చేరుకోవడం గమనార్హం. చాలాకాలంగా ఖాళీగావున్న సీఎంవో పోస్టును భర్తీచేసేందుకు ఇన్‌చార్జి ఏపీసీగా వ్యవహరిస్తోన్న డీఈవో నోటిఫికేషన్ జారీచేసే ప్రయత్నాలకు ఆ ఉద్యోగి మోకాలడ్డుతున్నట్టు సమాచారం. మరో నెలరోజుల్లో ఆరునెలల వ్యవధి పూర్తవుతున్నందున అప్పటివరకు సీఎంవో పోస్టు భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వరాదని ఓవిధంగా జిల్లా అధికారులపైనే బెదిరింపులకు దిగుతున్నట్టు ప్రచారం జరుగుతోంది. జనవరి తర్వాత నోటిఫి కేషన్ నామకార్థంగా ఇప్పించుకుని, రాష్ట్రస్థాయిలో తనకున్న పరిచయాలతో సీఎంవో పోస్టును నేరుగా పొందాలన్నది ఆ ఉద్యోగి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో కొందరు ఐఏఎస్ అధికారులు, విద్యాశాఖలో కొందరు ఉన్నతాధికారులు మద్దతుగా నిలుస్తున్నారంటూ ఆ చిరుద్యోగి ప్రచారం చేసుకుంటుండంపై ఇప్పటికైనా దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

కార్ల కోసం కీచులాట

ప్రభుత్వ పాఠశాలల్లో అకడమిక్ కార్యకలాపాలను పర్యవేక్షణకు సెక్టోరల్ ఆఫీసర్లు సందర్శించడానికి, తనిఖీ చేయడానికి సమగ్రశిక్ష జిల్లా కార్యాలయానికి 3 అద్దెకార్లు కేటాయించారు. వీటి వినియోగంలో కార్యాలయంలో అంతర్గత కొట్లాట జరుగుతున్నట్టు సమాచారం. నిర్దేశిత సెక్టోరల్ అధికారులు వాడుకోవడానికి వీలులేకుండా ఆ చిరుద్యోగి ఆటంకాలు పెడుతున్నట్టు తెలుస్తోంది. క్షేత్రస్థాయి తనిఖీలకు సెక్టోరల్ అధికారులు వెళ్లడానికి అవకాశం ఉండడంలేదని చెబుతున్నారు. తనకోసమే ఓ కారును ప్రత్యేకించుకుని కార్యాలయం నుంచి ఇంటికి మూడు పూటలా రాకపోకలకు, ప్రైవేటు పనులకు వినియోగించుకోవడం గమనార్హం. సమగ్రశిక్షలో కొత్తగా విధుల్లో చేరిన అధికారి ఒకరు శుక్రవారం ఉదయం తన కార్యాలయానికి చేరుకునేందుకు కారు అందుబాటులో లేకపోవడంతో గత్యంతరం లేక బస్టాండ్ నుంచి నడకమార్గాన్ని ఎంచుకోగా, కారు వినియోగించుకునేందుకు వెసులుబాటులేని ఆ చిరుద్యోగిని ఇంటి నుంచి ఆఫీసుకు తీసుకొచ్చేందుకు వాహనం వెళ్లడం ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశమైంది.

కొత్తవారికి చోటు లేదు..!

ఎస్ఎస్ఏ జిల్లా ప్రాజెక్టులో నిర్ణీత డిప్యూటేషన్ గరిష్ఠ కాలవ్యవధి మూడేళ్లు పూర్తయిన వారినందరినీ వారి మాతృస్థానాలకు పంపించి కొత్తగా నియామకాలను నోటిఫికేషన్ ద్వారా చేపట్టాలి. ఇక్కడి కార్యాలయంలో మాత్రం ఈ నిబంధనలు అమలుకావడం లేదు. కొత్త నోటిఫికేషన్లను జారీ చేయనీయకుండా అడ్డుకోవడం లేదా పలుమార్లు వాయిదాలు వేయించడం, తమకు నచ్చినవారికి నియామకపత్రాలు వచ్చేలా ఉన్నతస్థాయిలో ప్రయత్నించడంలో ఆ ఉద్యోగి పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికిభిన్నంగా ఎవరు నియామకపత్రాలు తెచ్చుకున్నా వారికి కార్యాలయంలో సీటు ఉండదని, మిగతా ఉద్యోగుల నుంచి సహాయ నిరాకరణ ఎదురవుతుందని సమాచారం.



విజేతలకు బహుమతులను అందిస్తున్న అధికారులు

యువ ఉత్సవ్ స్ఫూర్తిదాయకం

ఏలూరు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యువ ఉత్సవ్ వంటి కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమని, వారిలోని ప్రతిభా పాటవాలను వెలికితీసేందుకు ఉపయోగపడతాయని జిల్లా యువజన అధికారి దూలం కిశోర్ అన్నారు. యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్ర, జిల్లా యువజన సర్వీసెస్, సెట్వెల్, ఆదిత్య డిగ్రీ కాలేజీల సంయుక్త ఆధ్వర్యంలో యువజన ఉత్సవాలను నిర్వహించారు. కిశోర్ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్‌మేళా, పెయింటింగ్, పద్యరచన, ప్రసంగం, ఫొటోగ్రఫీ, జానపద సంప్రదాయ కళల్లో జిల్లా యువత పాల్గొనడం ఎంతో ప్రశంసనీయమన్నారు. యువతి యువకులు అద్భుత ప్రతిభ ప్రదర్శించారన్నారు. సెట్వెల్ సీఈవో ప్రభాకర్ మాట్లాడుతూ స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత లక్ష్యాలను సాధించాలన్నారు. మాజీ ప్రధాని దివంగత మన్మోహన్‌సింగ్‌కు నివాళులు అర్పించి వారి ఆత్మశాంతికి మౌనం పాటించారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు మాట్లాడారు. యువ ఉత్సవ్‌లో అభినయ నృత్యభారతి కార్యదర్శి హేమసుందర్, కళాశాల సిబ్బంది, నలుమూలల నుంచి వచ్చిన యువతీ యువకులు పాల్గొన్నారు.

నేడు భీమవరంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్

భీమవరం అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), నేషనల్ కెరీర్ సర్వీస్ (ఎన్‌సీఎస్) ఆధ్వర్యంలో భీమవరం ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలియజేశారు. ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో అపోలో ఫార్మసీ, మెడ్ ప్లస్, టీం లీజ్, గోదావరి అర్బన్ బ్యాంక్ వంటి కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని, కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని వివరించారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఆసక్తి ఉన్నవారు ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 94418 41622 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ నుంచి అవార్డు అందుకున్నా..

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటపతి వర్మ

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 2006 సెప్టెంబరు 5న అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నుంచి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నానని పట్టణానికి చెందిన కలిదిండి వెంకటపతి వర్మ తెలిపారు. మన్మోహన్‌సింగ్ మృతి తనను కలిచివేసిందని, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆరోజు మన్మోహన్ నివాసంలో దేశంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న వారితో కలిసిఉన్న ఫొటో తనకు తీపి జ్ఞాపకం అని వెంకటపతివర్మ తెలిపారు.



మాజీ ప్రధాని మన్మోహన సింగ్‌తో అవార్డు అందుకున్న వారితో వెంకటపతి వర్మ (ఫైల్)



కోతులను తరిమేందుకు కొండముచ్చులను తిప్పుతున్న పంచాయతీ సిబ్బంది

కోతులపై కొండముచ్చు ప్రయోగం

పెద్ద రౌడీని చూసి చిన్న రౌడీ భయపడినట్లుంది. ఆకృతిలోనే పెద్దగా కనిపించే కొండముచ్చు అంటే కోతులకు హడల్. కొండముచ్చు కనిపిస్తే చాలు కోతుల గుంపు చెల్లాచెదురవుతుంది. గ్రామాల్లో కోతుల బెడద పెరగడంతో కొందరు కొండముచ్చు ఆకారాలను ఇళ్ల గోడలపై ఉంచుతారు. ఇప్పుడు కోతులను తరిమేందుకు కొండముచ్చులనే రంగంలో దింపారు. కోతుల సమస్యను అధిగమించడానికి పంచాయతీలు కూడా ఇదే బాట పట్టాయి. ముదినేపల్లి గ్రామంలో కోతుల బెడదను నివారించేందుకు పంచాయతీ అధికారులు రెండు కొండ ముచ్చులను అద్దెకు తెచ్చారు. వాటిని చెక్క బండిపై పెట్టి వీధుల్లో తిప్పుతున్నారు. ఇటీవల గ్రామంలో 150 కోతులను పట్టించి వేరే ప్రాంతాలకు తరలించినా మళ్లీ వాటి సంచారం ఎక్కువైపోతుంది. మహిళలను, వసతి గృహ విద్యార్థులను, పిల్లలను కరవడమే కాక, ఇళ్లల్లోని తినుబండారాలను సైతం ఎత్తుకుపోతున్నాయి. కోతుల ఆగడాలతో విసిగిపోయిన గ్రామస్తులు పంచాయతీ అధికారులను ఆశ్రయించారు. కోతులను తరిమేందుకు పంచాయతీ అధికారులు కొండముచ్చులను ప్రయోగించారు. వీటికి రోజుకు రూ.వెయ్యి అద్దె చెల్లించాలి. వారం రోజులపాటు పంచాయతీ ఏరియాలోని అన్ని ప్రాంతాల్లో కొండముచ్చులను తిప్పుతామని సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ తెలిపారు.

- ముదినేపల్లి, ఆంధ్రజ్యోతి



బుట్టాయగూడెంలో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు, గిరిజనులు

అధికారులే కార్యాలయాన్ని పునః నిర్మించాలి

» సీపీఐ కార్యాలయం కూల్చివేతపై ఆగ్రహం » సీఎం దృష్టికి తీసుకెళ్తాం
» ఏజెన్సీలో ఆక్రమణలపై చర్యలు ఏవీ? » సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

బుట్టాయగూడెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బుట్టాయ గూడెం మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయం కూల్చి వేత విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్ళనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. ఏ స్థితిలో ఉన్న కార్యాలయాన్ని అదే స్థితిలో తిరిగి అప్పగించాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. సీపీఐ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా శుక్రవారం ఆయన బుట్టాయగూడెం మండలంలో పర్యటించారు. ముందుగా కొత్తపేట నుంచి నెహ్రూబొమ్మ సెంటరు వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. కూల్చివేతకు గురైన పార్టీ కార్యాలయాన్ని పరిశీలించారు. తర్వాత పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలోను, బహిరంగ సభలో మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన జిల్లాల్లో కార్యాలయాలను నిర్మించుకోడానికి స్థలాలు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును అడగటం జరిగిందని ఆయన సానుకూలంగా స్పందించారని అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తహసీల్దార్ చర్యలను తీవ్రంగా ఖండించారు. ఏజెన్సీలో అధికారుల తీరువలన కూటమి ప్రభుత్వానికి అనతికాలంలో వ్యతిరేకత వస్తుందన్నారు. ఏజెన్సీలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు తెలిపారు. ఏజెన్సీలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా అనేక అక్రమ కట్టడాలు నిర్మాణాలు జరుగుతున్నాయని, ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురైన వివరాలు తమవద్ద ఉన్నాయని అధికారులకు ఇస్తామని ఎన్నిరోజుల్లో చర్యలు తీసుకుంటారో చూసి తదుపరి చర్యలకు పూనుకుంటామన్నారు. రాష్ట్ర నాయకురాలు అక్కినేని వనజ, డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, బంది వెంకటేశ్వరావు, యు.హేమశంకర్, ఎస్.సాయిబాబా పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

కారుమూరి హయాంలోనే లేహం ఫ్యాక్టరీ ఏర్పాటు

ఎమ్మెల్యే ఆరిమిల్లి ధ్వజం

తణుకు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తేతలి సమీపంలో లేహం ఫుడ్ ఫ్యాక్టరీ దరిద్రాన్ని తీసుకొచ్చిందని మాజీ మంత్రి కారుమూరి అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ధ్వజమెత్తారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పశువధ పరిశ్రమ మూసేయాలని పోరాడే నైతిక అర్హత కారుమూరికి లేదన్నారు. పరిశ్రమ రావడానికి కర్మ, కర్త, క్రియ అన్నీ కారుమూరే అని చెప్పారు. 2013లో కారుమూరి హయాంలోనే పశువధ పరిశ్రమ తెచ్చారని విమర్శించారు. టీడీపీ అధికారంలో ఉన్నపుడు 2014నుంచి 2019వరకు పరిశ్రమ నడవలేదన్నారు. ఇప్పటికీ తాము పరిశ్రమకు పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన కారుమూరి పరిశ్రమకు అనుమతులు వచ్చాయన్నారు. ఇపుడు కారుమూరి అబద్ధాలు, అసత్యాలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. 2019నుంచి 2024లో అనుమతులు రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందని చెప్పారు. కారుమూరి అధికారంలోకి వచ్చాక 2023లో పంచాయతీ అనుమతి లేకపోతే 3ఏప్రిల్ 2023లో టౌన్ ప్లానింగ్ ఏలూరు నుంచి సింగిల్ విండో అనుమతులు తీసుకొచ్చారని వివరించారు. లేహం పరిశ్రమకు అనుబంధంగా కారుమూరి కొడుకు, బంధువులు కలసి హరి ప్రొటీన్ ఫుడ్స్ అనుబంధ పరిశ్రమని స్థాపించి వ్యాపారానికి సిద్ధపడ్డారని విమర్శించారు. దానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయ నిరుద్యోగులు కొంతమంది రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. కారుమూరి ముసుగులో పడవద్దని ప్రజలను కోరారు. కూటమి నాయకులు కలగర వెంకటకృష్ణ, బసవా రామకృష్ణ, మంత్రిరావు వెంకటరత్నం, పితాని మోహన్, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, చిక్కాల వేణు, ఆకేటి కాశీ, ఆనాల ఆదినారాయణ, గోవిశెట్టి రామకృష్ణ, తాతపూడి మారుతీరావు తదితరులు పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన


స్థల పరిశీలన చేస్తున్న ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, ఎండీ పృథ్వీతేజ్, విద్యుత్ అధికారులు

ద్వారకాతిరుమల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి గృహవినియోగదారుడు పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని వినియోగించుకుని సోలార్ రూఫ్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ చైర్మన్, ఎండీ ఇమ్మడి పృథ్వీతేజ్ అన్నారు. మొదటిసారిగా ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో ద్వారకాతిరుమలలో ఏర్పాటు చేసే 750 కేపీ సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. విద్యుత్ శాఖ అధికారులు ఆయనకు వివరాలు తెలియజేశారు. గృహ వినియోగదారులు సోలార్ రూఫ్‌ను ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లుల ఆదాతో పాటు ఉత్పత్తి అయిన మిగులు కరెంటును ప్రభుత్వానికి విక్రయించవచ్చన్నారు. సోలార్ రూఫ్ టాప్ ప్యానల్స్ ఏర్పాటుకు బ్యాంకర్లు తక్కువ వడ్డీకే రుణ సదుపాయం అందజేస్తారని తెలిపారు.

జిల్లా మత్స్యకార సొసైటీ అధ్యక్షుడిగా వసంతరావు ఎన్నిక


వసంతరావును అభినందిస్తున్న విప్ నాయకర్, ఎమ్మెల్యే ధర్మరాజు, జనసేన నాయకులు

నరసాపురం రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మత్స్యకార సహకార సంఘం జిల్లా అధ్యక్షుడుగా నరసాపురం మండలం చినలంక గ్రామానికి చెందిన మైలా వసంతరావు ఏకగ్రీవ ంగా ఎన్నికయ్యారు. ఏలూరు మత్స్య శాఖ కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికల్లో మొత్తం ఆరుగురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. అయితే చివరికి ఐదుగురు విత్‌డ్రా చేసుకోవడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. తీర ప్రాంతంలో వసంతరావుకు మత్స్యకార సంఘాల్లో మంచి పట్టు ఉంది. గతంలో ఎంపీటీసీగా పని చేశారు. పవన్ సిద్ధాంతాలు నచ్చి 2014లో జన సేనలో చేరారు. అప్పటి నుంచి ఆపార్టీలో కీలకంగా ఉంటూ వచ్చారు. వసంత రావు ఎన్నికపై ప్రభుత్వ విప్ నాయకర్, ఉంగు టూరు ఎమ్మెల్యే ధర్మరాజు అభినందించారు.

నెంబర్‌ప్లేటు లేకుండా వాహనడిపితే కఠిన చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న టూటౌన్ సీఐ వైవీ రమణ

ఏలూరు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరంలో నెంబర్ ప్లేటు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏలూరు టూటౌన్ సీఐ వైవి రమణ హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో టూటౌన్ సీఐ వైవి రమణ తన సిబ్బందితో శుక్రవారం రాత్రి నగరంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. నెంబర్ ప్లేటు లేని వాహనాలకు, సరైన ధృవపత్రాలు లేని వాహనాలకు ఇ చలానాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన వాహనదారులతో మాట్లాడుతూ ఎవరైనా డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే ఐదు వేల రూపాయలు జరిమానా విధించడబడుతుందని, ఇన్సూరెన్సు లేకపోతే రెండు వేల రూపాయలు, హెల్మెట్ ధరించక పోతే వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. నెంబర్ ప్లేటు లేని వాహనాలను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే పది వేల రూపాయలు జరిమానా విధిస్తామని వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.


ఇండోర్ స్టేడియం వద్ద ఎస్సీ నాయకుల నినాదాలు


వినతులు స్వీకరిస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా


ఎంఆర్పీఎస్ నాయకుల నినాదాలు

ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ

ఎస్సీ వర్గీకరణ అనుకూల, వ్యతిరేక వర్గాలు రాక.. కలెక్టరేట్ ఎదుట నినాదాలు

ఏలూరు టూటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి షెడ్యూల్ ఉప కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం రంజన్ మిశ్రాను నియమించింది. ఏసభ్య కమిషన్ జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ ఉపకులాల ప్రతినిధులు, ఉద్యోగులు, న్యాయవాదులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతుల స్వీకరణతో పాటు వారి అభిప్రాయాలను కూడా రాజీవ్ రంజన్ మిశ్రా విన్నారు. వినతులన్నిటిని పూర్తిగా పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి అందిస్తామని మిశ్రా స్పష్టం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా ఎస్సీ కులాలకు చెందిన వారు వినతులు సమర్పించారు. ఇంకా ఎవరైన వినతులు ఇవ్వనివారుంటే విజయవాడ గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కార్యాలయంలో అందించాలన్నారు. మెయిల్ ద్వారా వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ లోపు పంపాలన్నారు. కార్యక్రమంలో సుమారు ఎస్సీ ఉపకులాలకు చెందిన 600మంది హాజరయ్యి 132 విజ్ఞాపనలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీ శివకిశోర్, డీఆర్వో విశ్వేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాశ్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపకులాల సమాచారం ఇవ్వండి

షెడ్యూల్ ఉప కులాల సమాచారాన్ని అందించాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో సమావేశం అయ్యారు. అధికారులకు కమిషన్ ఉద్దేశాన్ని దిశానిర్దేశం చేశారు.

పోటాపోటీగా వినతి పత్రాలు

రాజీవ్ రంజన్ మిశ్రాకు కలెక్టరేట్‌లో ఎస్సీ ఉపకులాలకు చెందిన ప్రతినిధులు, సంఘాలు, వ్యక్తులు వినతిపత్రాలు సమర్పించారు. వినతిపత్రాలు సమర్పించిన వారిలో ఎంఆర్ పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్, అంబేడ్కర్, పూలే వేదిక చైర్మన్ నేతల రమేష్‌బాబు, దళితహక్కుల పోరాట అధ్యక్షుడు జుజ్జవరపు ప్రతాప్‌కుమార్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబి, షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్, ఏపీ మాల ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు బేతాళ సుదర్శన్, పీవీసుబ్బారావు, సాయిరాజు, సుబ్బా రావు, ఎస్సీ, ఎస్టీ బహుజన్ రైట్స్ సొసైటీ ప్రొటెక్షన్ అధ్యక్షులు మేతర అశోక్, వినుకొండ రామయ్య, మాలమహానాడు జాతీయ అధ్యక్షు లు అలగా రవికుమార్, బహుజనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మత్తే కుమార్, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఎం.నాగరాజు, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు కాశీవిశ్వనాథ్, రాష్ట్ర ఎంఆర్‌పీ ఎస్ అధ్యక్షులు ఆర్.సురేష్, బయ్యారపు రాజేశ్వ రరావు తదితరులు వినతిపత్రాలు అందించారు. అనంతరం ఇండోర్ స్టేడియం వద్ద ఎస్సీలోని ఉపకులాల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఒకవర్గం ఎస్సీ వర్గీకరణ వద్దని, మరో వర్గం వర్గీకరణ కావాలని నినాదాలు చేశారు. పోలీసులు కలుగజేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కుల సంఘాల నాయకులను పంపించి వేశారు. చింతల పూడి, ప్రగడవరం గ్రామాలకు చెందిన ఎంఆర్‌పీఎస్, మాలల జేఏసీ ఆధ్వ ర్యంలో విడివిడిగా తమ అభిప్రాయాలను విజ్ఞా పన పత్రాల రూపంలో చైర్మన్‌కు అందజేశారు.

పటిష్ఠ పోలీసు బందోబస్తు

ఏలూరు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు విచ్చేసిన ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాకు శుక్రవారం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలం, వ్యతిరేక వాదనలు వినతిపత్రాల రూపంలో కలెక్టరేట్‌లో ఆయన స్వీకరించిన నేపథ్యంలో కలెక్టరేట్‌కు 500 మీటర్ల దూరం నుంచి అన్ని రోడ్లను పోలీసులు దిగ్బంధం చేశారు. ముగ్గురు కంటే ఎక్కువగా గుమ్మిగూడి ఉండకుండా ముందస్తుగా జిల్లా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో త్రి టౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతిపత్రాలు స్వీకరించారు. అప్పటి వరకు పోలీసులు అప్రమత్తంగానే ఉన్నారు. ఎక్కడా ఎలాంటి అల్లర్లు జరుగకుండా ముందస్తుగా ఒక డీఎస్పీ, 9 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది మొత్తం 300 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం మారినా.. రాష్ట్రంలో అవే విధానాలు

» హామీలు గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం
» ముగిసిన సీపీఎం రాష్ట్ర సమావేశాలు


మాట్లాడుతున్న సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

నరసాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఆరు నెలలు గడుస్తున్నా... ఇంకా గత ప్రభుత్వ విధానాలే కనిపిస్తున్నాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో రెండో రోజు శుక్రవారం సీపీఎం రాష్ట్ర సమావేశాల్లో రాఘవులు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి ఢిల్లీలో మోదీ, బీజేపీ పెద్దలకు కూటమి నేతలు జీహుజూర్ అంటూ భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ విధానాలను డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ భుజాన వేసుకుని సనాతన ధర్మం అంటూ రొడ్డెక్కడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ధోరణిలతో సమాజాన్ని డిప్యూటి సీఎం పవన్ ఎటువైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారో చెప్పాలని అన్నారు. గత ప్రభుత్వంపై అనేక విమర్శలు చేసిన సీఎం చంద్రబాబు నేడు అవే విధానాలను అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై రూ.1600 కోట్ల భారం మోపిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర రహదార్ల పెట్టి టోల్‌గేట్‌లు పెట్టి ఎడాపెడా దోచుకునేందుకు రంగం సిద్ధం చేసిందన్నారు. పేరుకే ఉచిత ఇసుక అని భారీగా ధర పెరిగిపోయిందని అన్నారు.

పలు అంశాలపై తీర్మానాలు

రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్ర సమావేశాల్లో పలు అంశాలపై తీర్మానాలు చేశారు. ఇందులో పెంచిన విద్యుత్ ఛార్జీలపై దశలవారిగా ఉద్యమం చేపట్టాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్‌పరం చేయనివ్వకుండా అడ్డుకోవాలని, అదానీతో కుదుర్చుకున్న ఒప్పందాల రద్దుకు దశల వారీగా ఉద్యమాలు చేపట్టాలని తీర్మానించారు.

తుందుర్రు ఉద్యమ కేసు కొట్టివేత


కోర్టు గేటు వద్ద మాజీ ఎంపీ మధు, సీపీఎం నాయకులు

నరసాపురం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): నరసాపురం మండలం తుంద్రురు ఆక్వా ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ప్రజల్ని రెచ్చగొడుతున్నారంటూ సీపీఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి మధు, మరో 11 మందిపై పెట్టిన కేసును శుక్రవారం నరసాపురం న్యాయమూర్తి కె.శ్రీనివాసరావు కొట్టివేశారు. సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో కేసును కొట్టివేస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పినట్లు సీనియర్ న్యాయవాది పురేళ్ళ శ్రీనివాస్ చెప్పారు. 2017లో ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా అప్పటి రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న మధు తుంద్రురుకు విచ్చేశారు. ప్రజల్ని ఆయన రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారంటూ అప్పట్లో పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. మధుతో పాటు అప్పటి జిల్లా కార్యదర్శి బలరాం, కవురు పెద్దిరాజు, గోపాలన్, కళ్యాణ్, రామాంజనేయులు, త్రిమూర్తులు, వాసు, సత్యనారాయణ, ప్రసాద్, రాజేశ్, వెంకటేశ్వర్లుపై పోలీసులు కేసు పెట్టారు. విచారణకు మధు పలు మార్లు నరసాపురం కోర్టుకు హాజరయ్యారు. ఈ క్రమంలో తుది తీర్పుకు కూడా విచ్చేశారు. కేసు కొట్టేయడంతో పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పోలవరం సందర్శనకు
పార్లమెంట్ కమిటీ

జనవరి10న రాక.. 11న పోలవరం పర్యటన.. సుమారు 30 మంది ఎంపీలు వచ్చే అవకాశం.. జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

రాజమహేంద్రవరం, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : పోలవరం సందర్శనకు పార్లమెంట్ కమిటీ హాజరవుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సమన్వయ శాఖల అధికారులతో జేసీ ఎస్.చిన్నరాముడు, ఎస్పీ డి. నరసింహ కిశోర్‌తో కలిసి శుక్రవారం సమీక్షించారు. జనవరి 11వ తేదీన సుమారు 30 మంది ఎంపీలతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పోలవరం ప్రాజెక్టు సందర్శిస్తుందన్నారు. 10వ తేదీ రాత్రి మధురపూడి విమానాశ్రయానికి కమిటీ సభ్యులు చేరుకుని రాజమహేంద్రవరంలో బస చేస్తారు. 11న ఇక్కడ నుంచి బయలుదేరి పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళతారన్నారు. ఎయిర్‌పోర్టు, రాజమ హేంద్రవరంలో వారు బస చేసే ప్రాంతంలోనూ కమాండ్ కంట్రోలు రూమ్ ఏర్పాటు చేయాల న్నారు. ఈ కమిటీ పర్యటన విజయవంతం కోసం లైజెనింగ్ అధికారులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎంపీల విడిది కేంద్రం వద్ద 24 గంటలూ ఉండే విధంగా అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. పదవ తేదీ రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని టూరిజం, సాంస్కృతిక శాఖ అధికారులకు సూచించారు. గోదావరి హారతికి ఎం పీలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ అధికారులను ఆదేశించారు. పోలీసు శాఖ బందోబస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మునిసిపల్ కమిషనర్ కేతన్‌గార్గ్, పోలవరం ప్రాజెక్టు అథారిటీ డిప్యూటీ డైరెక్టర్ డీఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

చెరువులో పడి పండ్ల వ్యాపారి మృతి

పెంటపాడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంటపాడుకు చెందిన దాడి వెంకటరమణ అలియాస్ శ్రీను(40) తాడేపల్లిగూడెం, పెంటపాడు పరిసర ప్రాంతాలలో పండ్లవ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తూ ఉంటాడు. గురువారం పెంటపాడులో వ్యాపారం చేసుకున్న ఇతను శుక్రవారం తెల్లవారు జామున ఊర చెరువులో చనిపోయి కనిపించాడు. ప్రమాదవశాత్తు జారి పడిపోయి ఉండవచ్చునని స్థానికులు భావిస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనుమానాస్పద మృతి కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ ప్రసాద్ తెలిపారు. కాగా చెరువులో నీటిని పూర్తిగా తొలగిస్తున్నట్లు కార్యదర్శి గోడి బాలకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతూ మెకానిక్ మృతి

భీమవరం క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు పట్టణానికి చెందిన పొట్నూరి సత్యశ్రీనివాస్ (40) భీమవరం పట్టణంలోని ద్విచక్రవాహనాల షోరూమ్‌లో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రోజూ పాలకొల్లు నుంచి భీమవరం తన బైక్‌పై వెళ్ళి వస్తుంటాడు. ఈ నెల 26వ తేదీన పాలకొల్లు నుంచి భీమవరం వస్తుండగా చినరంగనిపాలెం రోడ్డు వద్దకు వచ్చేసరికి మోటార్ సైకిల్ అదుపు తప్పి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్‌చేసి భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. దీనిపై అతనికి వరుసకు సోదరుడైన పిల్లా వెంకటరమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణాజీ తెలిపారు.

యువతి ఇంటి ముందు తెలంగాణ కానిస్టేబుల్ హల్‌చల్

చాట్రాయి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో నరసింహారావుపాలెంలో గురువారం రాత్రి ఓ యువతి ఇంటి ముందు తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్ పూరేటి నాగరాజు హల్‌చల్ కలకలం సృష్టించింది. సమాచారం అందటంతో నాగరాజును అదుపులోకి కేసు నమోదు చేశామని చాట్రాయి ఎస్సై రామకృష్ణ చెప్పారు. వివరాల ప్రకారం తెలంగాణ పరిధిలోని వేంసూరు మండలం లచ్చన్నగూడెంకు చెందిన పూరేటి నాగరాజు హైదరాబాద్ తెంగాణ సచివాలయంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య పిల్లలు ఉన్నారు. నరసింహారావుపాలెంకు చెందిన యువతితో నాగరాజుకు కొద్ది కాలం క్రితం పరిచయం ఏర్పడింది. ఈ విషయం యువతి తల్లి దండ్రులకు తెలియటంతో పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువెళటంతో నాగరాజును మందలించారు. ఈ నేపథ్యంలో నాగరాజు గురువారం రాత్రి నరసింహారావుపాలెం వచ్చి పెళ్ళి చేసుకుంటానని యువతిని తీసుకువెళుతుండగా యువతి తల్లిదండ్రులు గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనితో నాగరాజు కత్తితో బెదిరించాడు. గ్రామస్తులు అతడిని పట్టుకొని తాళ్ళతో కట్టేసి చాట్రాయి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

కొబ్బరిపీచు పరిశ్రమలో మంటలు

రూ.కోటి నష్టం



పెదవేగి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో పీచు పరిశ్రమ బుగ్గిపాలైంది. పీచు పరిశ్రమ యజమాని చదలవాడ శ్రీధర్ తెలిపిన వివరాలు ప్రకారం.. రాయన్నపాలెంలో రూ.6కోట్లతో కొబ్బరిపీచు పరిశ్రమను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గురువారం రాత్రి ఏడు గంటల సమయంలో విద్యుదాఘాతంతో పీచుకు నిప్పంటుకుని మంటలు శరవేగంగా వ్యాపించాయి. ప్రమాదాన్ని గమనించిన పరిశ్రమ మేనేజర్ బాలాజీ ఏలూరు అగ్నిమాపకశాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపకశాఖాధికారి వి.రామకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది మూడు అగ్నిమాపక శకటాల సాయంతో తెల్లవార్లు కష్టపడి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో వంద టన్నుల వరకు పీచు కాలి బూడిదైందని, రెండు భారీ యంత్రాలు, భారీగోడౌన్లు దగ్ధమయ్యాయని పరిశ్రమ యజమాని శ్రీధర్ చెప్పారు. ఈ పరిశ్రమలో 20కుటుంబాలు పని చేస్తున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో కూలీలు లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు.

ట్రాక్టర్ ప్రమాదంలో డ్రైవర్ మృతి

ఉంగుటూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పంట దమ్ము కోసం ట్రాక్టర్ నడుపుతున్న ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు శుక్రవారం నాడు మృతి చెందాడు. చేబ్రోలు పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం కాగుపాడు గ్రామానికి చెందిన కృష్ణ(39) మినీ ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా అదపు తప్పి చెట్టుకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మృతుడి అన్న శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య సరిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

పెంటపాడు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి) : అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని బీ.కొండేపాడు గ్రామంలో చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బీ.కొండేపాడు గ్రామానికి చెందిన పొత్తూరి చిన వెంకన్న(77) తన మనువలతో కలసి ఉంటున్నాడు. గురువారం రాత్రి పడుకున్న వెంకన్న తెల్లవారేసరికి చనిపోయి ఉన్నాడు . చెవిలో నుంచి రక్తం కూడా రావడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏఎస్ఐ రాజేంద్ర అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి



తణుకు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తణుకు మండలం దువ్వ గ్రామంలోని జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు తణుకు రూరల్ ఇన్‌చార్జి ఎస్సై జానా సతీశ్ తెలిపారు. దువ్వ గ్రామంలోని వెంకయ్య వయ్యేరుకు సమీపంలో జాతీయ రహదారిపై బిక్షాటన చేసుకుని జీవించే సుమారు 60 నుంచి 65 సంవత్సరాల వయస్సు వున్న గుర్తు తెలియని పురుష మృతదేహాన్ని గుర్తించినట్లు తెలిపారు. జాతీయ రహదారిపై నడుస్తూ వెళ్తున్న మృతుడిని తాడేపల్లిగూడెం నుంచి తణుకు వైపు వెళ్తున్న కారు ఢీకొనడం వలన మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిస్తే తణుకు రూరల్ ఎస్ఐ 94407 96641, లేదా రూరల్ పోలీస్ స్టేషన్ 08819 224233 తెలియజేయాలని ఎస్ఐ తెలిపారు.



త్రినాథరావుకు శ్రీవారి శేషవస్త్రంతో సత్కారం

ద్వారకా తిరుమల ఇన్‌చార్జ్ ఈవోగా త్రినాథరావు

ద్వారకాతిరుమల, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): శ్రీవారి దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా వేంద్ర త్రినాథరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు, పండితులు స్వాగతం పలికారు. పండితులు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. వచ్చేనెల 10న జరుగనున్న ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై ఆలయ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. 9న ఆలయ తొలిమెట్టు వద్ద నుంచి ప్రారంభం కానున్న గిరిప్రదక్షిణ ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని సూచించారు. క్షేత్రానికి వచ్చే గోవిందస్వాములకు, భక్తులకు అసౌకర్యం కలుగకుండా చూడాలని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

డిప్లొమా ఇంజినీర్స్ జిల్లా అధ్యక్షుడిగా మురళీకృష్ణ

ఏలూరు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏపీ పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా శాఖమూరి మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఏలూరులో అసోసియేషన్ ఏలూరు జిల్లా యూనిట్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఇప్పటివరకు జిల్లా అధ్యక్షుడిగా ఉన్న ఎం.విజయ్‌కుమార్, రాష్ట్రకార్యవర్గంలో సంయుక్త కార్యదర్శిగా ఎంపిక కావడంతో ఆయన స్థానంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా మురళీకృష్ణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ పంచాయతీరాజ్‌లోని అన్ని సబ్ డివిజన్‌లలో ఖాళీ అయిన జేటీవో పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. మురళీకృష్ణను సభ్యులు ఘనంగా సత్కరించారు. నాయకులు బోసు బాబు, విశ్వనాథరాజు, ఉపాధ్యక్షుడు కృష్ణ మోహన్, డీఈ సీతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

కామవరపుకోట, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మధ్యాహ్నం 2 గంటలకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సరళకుమారి, ఏఓ సత్యవేణి తెలిపారు. ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి అధ్యక్షత వహిస్తారని, అధికారులు అభివృద్ధి నివేదికలను సమర్పిస్తారని, వాటిపై తగు చర్చలు, తీర్మానాలు జరుగుతాయని, సభ్యులంతా సకాలంలో హాజరుకావాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఇంటర్వ్యూ

ఉంగుటూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హిస్టరీ లెక్చరర్ (గెస్ట్) పోస్టుకు ఈ నెల 31 ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు తెలిపారు.

కృత్రిమ అవయవాల వితరణ



ద్వారకా తిరుమల, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): త్రీడీ ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను ద్వారకాతిరుమల విర్డ్ ఆసు పత్రిలో 15 మంది దివ్యాంగులకు శుక్రవారం అందజేశారు. గుప్తా ఫౌండేషన్ సహకారంతో మేనేజర్ శ్రీనివాస్ వీటిని అందించారు. విర్డ్ ఆసుపత్రి చైర్మన్ రాజా ఎస్‌వి సుధాకరరావు మాట్లాడుతూ దాతల సదుపాయాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ట్రస్టు సభ్యులు ఐవీఆర్ సుధాకర్, వి. నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, నాగేంద్ర బాబు, సింధ, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

30న పీడీఎస్‌యూ సమావేశం

ఏలూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ డివిజన్, నగర కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 30న ఏలూరులోని సంఘ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.నాని తెలిపారు. సమావేశం కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. సంఘ నూతన కార్యవర్గాలను ఎన్నుకుంటామన్నారు.



ఆదివాసీలను ఆదుకోవాలి

బుట్టాయగూడెం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు చేయూతనిచ్చేందుకు మరిన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ కరాటం రాంబాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం రెడ్డి గణపవరం పంచాయతీలోని పల్లపూరు ఆర్‌అండ్‌ఆర్ నిర్వాసిత కాలనీలో అన్ని అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు తాడేపల్లిగూడెంకు చెందిన ఆత్మబంధువులం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో డాక్టరు జాగృతి తల్లి విజయలక్ష్మి ఆర్థిక సాయంతో భోజనం పేట్లు, గ్లాసులు, దుప్పట్లు, పలకలు, సబ్బులు, చాపలను అందజేయగా బాలరాజు, కరాటం పంపిణీ చేశారు.

టీడీపీ నాయకుల చేయూత

పెదవేగి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమై సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి టీడీపీ గ్రామ నాయకులు నిత్యావసరాలు, వంట సామగ్రిని అందించారు. పెదవేగి మండలం కూచింపూడికి చెందిన కలతోటి మరియమ్మ ఇల్లు బుధవారం దగ్ధమైన విషయం విదితమే. బాధిత కుటుంబానికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు గిత్తా సత్యనారాయణ, దాసరి శ్రీనివాసరావు, మాత్రపు ప్రకాశం, గెడ్డం దాసు సాయం చేశారు.



ఏలూరు విద్యుత్ భవనం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వైసీపీ నాయకులు

విద్యుత్‌ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ఏలూరు రూరల్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై విద్యుత్‌ఛార్జీల పేరుతో అదనపు భారాన్ని మోపిన కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా వైసీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్ళపల్లి జయప్రకాశ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్.ఆర్‌పేట లోని విద్యుత్ భవనం వద్ద ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్‌ఛార్జీలు పెంచబోమని, అవసరమైతే 30 శాతం తగ్గిస్తామని ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చినహామీ ఏమైందని ప్రశ్నించారు. విద్యుత్‌శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మాజీ డిప్యూటీ మేయర్ గుడిదేసి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, కార్పొరేటర్లు సుంకరచంద్రశేఖర్, జి.విజయనిర్మల, తంగెళ్ళరాము, పార్టీ నాయకులు పాల్గొన్నారు. తొలుత రామచంద్రరావుపేట, వెంకటేశ్వర స్వామి కోవెల నుంచి ర్యాలీగా బయల్దేరి విద్యుత్‌భవనం వద్ద ధర్నా నిర్వహించారు.

ఉంగుటూరు: రాష్ట్రంలో విద్యుత్తు చార్జీల పెంపుపై ఉంగు టూరు నియోజకవర్గ వైసీపీ శ్రేణులు శుక్రవారం ర్యాలీ నిర్వహించాయి. మాజీ ఎమ్మెల్యే పుప్పాల శ్రీనివాసరావు, 4 మండలాల పార్టీ అధ్యక్షులు పాల్గొన్నారు. నారాయణపురం విద్యుత్ ఏఈఈ కార్యాలయంలో వినతి పత్రం అందించారు.

కొయ్యలగూడెం: కరెంటు ఛార్జీల పెంపుపై పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు నిరసన తెలిపి కొయ్యలగూడెం సబ్ స్టేషన్ ఏఈ రామారావు వినతిపత్రం ఇచ్చారు. వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి: వైసీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా స్థానిక విద్యుత్ శాఖ ఏడీ కార్యాలయం వద్ద నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ కంభం విజయరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో లింగపాలెం, చింతలపూడి మండలాలకు చెందిన నాయకులు జ్ఞానా రెడ్డి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: ప్రజలపై కూటమి ప్రభుత్వం విద్యుత్ భారం మోపిందని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి జెట్టి గురునాథరావు అన్నారు. శుక్రవారం పేరంపేట రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించి అధి కారులకు వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నాగలక్ష్మి, వైస్ చైర్మన్ వీరాంజనేయులు, ఎంపీపీ కొదమజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులతో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ తదితరులు

తొలి విడతలో 42 మందికి ఉద్యోగాలు: రోషన్

చింతలపూడి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని మండలాల వారీగా ఇంటర్వ్యూలు నిర్వహించి శుక్రవారం 42 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించినట్టు ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. రానున్న ఐదేళ్లలో మరిన్ని ఉద్యోగ మేళాలు నిర్వహిస్తానని, తనకున్న పరిచయాలతో ఖర్చులు భరిస్తూ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. ఎమ్మెల్యే ను పలువురు అభినందించారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, టీడీపీ నాయకులు ముత్తారెడ్డి, చలపతిరావు, రావూరి కృష్ణ, కె.రాజ శేఖరరెడ్డి, సాయల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర 2047 పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నిడమర్రు డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-2047 పోటీల్లో ఫత్తేపురం హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం పి.సత్యనారాయణ తెలిపారు. వ్యాస రచనలో గునగొండ కీర్తన ప్రథమ, వక్తృత్వంలో రొక్కల లిఖిత తృతీయ స్థానంలో నిలిచారు. శుక్రవారం ఏలూరులో జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు డీఈవో వెంకటలక్ష్మమ్మ, పశ్చిమ డీఈవో నారాయణ నుంచి బహుమ తులందుకున్నారు. విజేతలను సర్పంచ్ రుద్ర రాజు వెంకటేశ్వరరాజు తదితరులు అభినందించారు.


దెందులూరు: స్వర్ణాంధ్ర-2047 జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి నితిన్ చక్రవర్తి జిల్లా మొదటి స్థానం సాధించి జడ్పీ చైర్మన్ ఘంటా పద్మశ్రీ చేతుల మీదుగా బహుమతి, ప్రశంసా పత్రం ను అందుకున్నారు.



ఫత్తేపురం విద్యార్థులకు బహుమతులు

ఉంగుటూరు: స్వర్ణాంధ్ర-2047 వ్యాస రచన జిల్లా స్థాయి పోటీల్లో నారాయణపురం జడ్పీ హైస్కూలు విద్యార్థిని జి.హర్ష ప్రియ ద్వితీయ స్థానం సాధించింది. శుక్రవారం ఏలూరులో జడ్పీ చైర్మన్ గంటా పద్మశ్రీ, డీఈవో వెంకట లక్ష్మమ్మ సర్టిఫికెట్‌ను అందించారు. గైడ్ టీచర్ గొల్లపల్లి రామారావు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం : చంటి



ఎల్‌ఓసీలు అందజేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయనిధి చెక్కులు, ఎల్‌ఓసీలను ఆయన అందజేసి మాట్లాడుతూ శుక్రవారం 9 మందికి రూ. 11 లక్షల 75 వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు అందజేశామన్నారు. ప్రభాకర్, వి.నాగసరస్వతి, జి.నరసవేణి, ఎం.సత్యవతి, దుర్గమ్మ, చంద్రగుప్త, ఎం.దుర్గావరలక్ష్మి, హేమంత్, బంగారమ్మకు చెక్కులు అందజేశారు.

ఎంతకాలం దాక్కుంటాడు

కొఠారు ఇంటివద్ద 16వ రోజు నిరసన

పెదవేగి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఎంతకాలం విదేశాల్లో దాక్కొగలడని కొల్లేరు లంక గ్రామస్తులు ప్రశ్నించారు. చేపల చెరువులకు సంబంధించి కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్తులు కొండలరావుపాలెంలో కొఠారు ఇంటి వద్ద చేపట్టిన నిరసన శుక్రవారానికి 16వ రోజుకు చేరుకుంది. వీరికి మద్దతుగా పైడిచింతపాడు గ్రామస్తులు నిరసన దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు లంక గ్రామస్తులు నేతల రవి, నంబూరి నాగరాజు మాట్లాడుతూ అబ్బయ్యచౌదరి ఐదేళ్లపాటు తమ చేపల చెరువులను అధికారాన్ని అడ్డుపెట్టుకుని భయపెట్టి లీజు పేరిట తీసుకున్నారన్నారు. ఐదేళ్లయినా కౌలు సొమ్ము ఇవ్వకుండా దేశం విడిచి పారిపోయాడని ఆరోపించారు. తమ సొమ్ము ఇచ్చేవరకు వదిలేది లేదని వారు పేర్కొన్నారు. సైదు సత్యనారాయణ, మోరు వరదయ్య, ముంగర పెద్దిరాజు, వెంకటేశ్వరరావు, పెనుమాల ప్రభాకరరావు, ఘంటశాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సవ వైభోగం



ద్వారకాతిరుమల, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): క్షేత్రంలోని ధను ర్మాస మండపంలో ఉభయ దేవేరులు, గోదాదేవితో కొలువైన చిన వెంకన్నకు శుక్రవారం ఉదయం జరిగిన ధనుర్మాస ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ముందుగా స్వామివారు, ఉభయ దేవేరులు, గోదాదేవితో కలసి క్షేత్రపురవీధుల్లో గజ, అశ్వ సేవలతో పాటు మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ ఊరేగించారు. తరువాత మండపంలో గోదాదేవితో సహ శ్రీవారి, అమ్మవార్లను ఉంచి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు శ్రీవారి తీర్థ, ప్రసాదాలను అందుకున్నారు.


ఏలూరులో శ్రీవారి సప్తాహాలు ప్రారంభం

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఆర్‌ఆర్ పేటలో వేంకటేశ్వరస్వామి సప్తాహ బ్రహ్మోత్సవాలు శుక్రవారం

ఆధ్యాత్మికం

ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే బడేటి చంటి స్వామివారి రథాన్ని లాగి కార్యక్రమాలను ప్రారంభించారు. కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, బొద్దాని శ్రీనివాస్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 4 నుంచి అచ్చమ్మ పేరంటాలు ఉత్సవాలు



దెందులూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంతాన లక్ష్మిగా పేరొందిన గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు 68వ వార్షికోత్సవాలను ఫిబ్రవరి 4 నుంచి 12 వరకు నిర్వహించేందుకు గాలాయగూడెం ఉత్సవ కమిటీ పందిరి రాటను ఏర్పాటు చేశారు. 9 రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రెండు లక్షల మంది వరకూ పాల్గొనే అవకాశం ఉండటంతో ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను ప్రారంభించింది. ఇప్పటికే దాత ఎస్ఎంఆర్ పెదబాబు రూ. 5 లక్షలతో ఆలయంలో స్టేజి నిర్మిస్తున్నారు. గాలాయ గూడెం గ్రామానికి చెందిన సీతామహాలక్ష్మి రూ. 1 లక్ష 1116లను ఆలయ కవిటీ సభ్యులకు అందజేశారు.



కేసును ఛేదించిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎస్పీ నయీం అస్మి

ఆపరేషన్ సిద్ధ

(ఐదో పేజీ తరువాయి)

శ్రీధర్‌వర్మ చేసిన అఘాయిత్యాన్ని పోలీసులు చాకచక్యంగా తెలుసుకుని 'ఆపరేషన్ సిద్ధ' పేరిట ఐదు రోజులపాటు విస్తృత తనిఖీలు చేసి చివరకు మచిలీపట్నం వద్ద అతన్ని అరెస్ట్ చేశారు. శ్రీధర్‌వర్మ, రెండో భార్య రేవతి, ప్రియురాలు సుష్మలను పోలీసులు తమదైన శైలిలో విచారించేసరికి తామే నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. తమ చుట్టూ ఇలాంటి నేరగాళ్లతో కలిసి ఉన్నామా ? అని కాళ్ల, ఉండి, భీమవరం తదితర ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. 'మొన్నే వారితో మాట్లాడాను. వారితో కలిసి టిఫిన్ చేశాను. ఏదో సాయం అడిగితే చేశాను. నేను రోజూ చూస్తుంటాను. మా కళ్ల ముందే ఇలా వెళుతుంటారు' అంటూ వారితో పరిచయం వున్నవారు వాటిని గుర్తు చేసుకుని స్థాని కులు హడలిపోతున్నారు. 'శవాలతో భయపెట్టి ఆస్తి రాయిం చుకోవాలని, ఇందుకోసం ఓ మనిషినే మట్టుబెట్టడం' అనే ఆలోచన వారికి ఎలా వచ్చిందో అంతుబట్టడం లేని వారు చెబుతున్నారు. అయితే శ్రీధర్‌వర్మపై గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదు. అయితే అతని అకౌంట్‌లో పదిహేను రూపాయలు మాత్రమే ఉండడం ఆశ్చర్యపరుస్తోంది. ప్రియురాలు సుష్మ పదేళ్ల కు మార్తె పాత్ర పెద్దగా లేదని పోలీసులు నిర్ధారిస్తున్నారు. వీరి అరెస్టుతో యండగండి వాసులు ఒక్కసారిగా హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అక్క ఆస్తి కోసం కుట్ర పన్ని ఓ అమాయకుడిని బలి తీసుకున్న ముగ్గురు వ్యక్తులకు కఠిన శిక్షలు విధించాలని.. ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురు నిందితులపై 252/2024 అండర్ సెక్షన్ 194 బిఎన్‌ఎస్‌ఎస్ ఆల్టర్ 2, 103, 61 (2), ఆర్/డబ్ల్యు 3 (5), బిఎన్‌ఎస్ కింద ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ నయీం అద్నాన్ అస్మి విలేకరులకు ఈ కేసు వివరాలను తెలిపారు. అనంత రం నిందితులు శ్రీధర్‌వర్మ, ఆయన భార్య రేవతి, సుష్మలను ఉండి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనం తరం అరెస్ట్ చూపించి భీమవరం కోర్టుకు తరలించడంతో 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. తొమ్మిది రోజులపాటు ఎస్పీ నయీం, ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ జయసూర్య, సీఐ జగదీశ్వరరావు, నాలుగు మండలాల ఎస్ఐలు కలిసి బృందాలుగా ఏర్పడి కేసులోని చిక్కుముడి ఛేదించినట్లు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి: డీఎంహెచ్‌వో

ఏలూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆరోగ్య కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేర్చడంలో వైద్యులు అంకితభావంతో పనిచేయాలని నూతన డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఆర్.మాలిని సూచించారు. శుక్రవారం ఆమె ను ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం(ఏపీపీహెచ్‌సీడీఏ) నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పల్లె ప్రాంతాల్లో రోగులకు అందుతున్న సేవలు, పీహెచ్‌సీల్లో సౌకర్యాలు, 104 వాహనాలద్వారా గ్రామాల్లో వైద్యపరీక్షలు, సర్వీసు విషయాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ఇంటింటా జరుగుతున్న క్యాన్సర్, షుగర్, బీపీ రోగనిర్ధారణ సర్వే ఎలా జరుగుతున్నదీ ఇకమీదట తాను స్వయంగా పరిశీలిస్తానని, క్షేత్రస్థాయి నివేదికలను సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. పీహెచ్‌సీల్లో ఏవైనా సమస్యలుంటే నేరుగా తనదృష్టికి తీసుకురావాలని సూచించారు. సంఘ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పూర్ణచంద్రకుమార్ తదితరులు డీఎంహెచ్‌ఓను కలిశారు.

పన్నులు సకాలంలో చెల్లించండి: ఆర్డీ నరసింహారావు



జంగారెడ్డిగూడెం, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంటి, కుళాయి పన్నులు సకాలం లో చెల్లించి పట్టణాల అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్, అఫిలియేట్ కమిషనర్ సీహెచ్.నాగ నరసింహారావు కోరారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లాలోని మున్సిపల్ కమీషనర్ లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జంగా రెడ్డిగూడెం సచివాలయాల సెక్రటరీలు సమయా నికి అటెండెన్సు వేయకుండా ఆలస్యంగా వేస్తున్నా రని గుర్తించిన ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన సచివాలయ సిబ్బందిని సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. పన్నుల వసూళ్ళను వేగవంతం చేయాలని సూచించారు. యానిమల్ బర్త్ కంట్రోల్‌ను త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. అనధికార లేఅవుట్‌లపై చర్యలు తీసుకుంటున్నాం. ఆ స్థలాల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేయాలని, అందుకు జిల్లా కలెక్టర్లు నుంచి సబ్ రిజిస్ట్రార్లకు సరైన ఆదేశాలుండాలన్నారు. యజమానులెవరో తెలియని పలు ఖాళీ స్థలాల వద్ద మున్సిపాలిటీ బోర్డులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, జంగారెడ్డిగూడెం, నూజివీడు మున్సిపల్ కమిషనర్లు రమణ, వెంకట రామిరెడ్డి, చింతలపూడి నగర పంచాయతీ కమిషనర్ డి.పావని పాల్గొన్నారు.

సర్క్యులర్ అమలు చేయమంటే పట్టించుకోరేం..?

ఆర్టీసీ జోనల్ చైర్మన్ అప్పలనాయుడు

ఏలూరు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగ భద్రతపై 2019లో తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ఇచ్చిన సర్క్యులర్‌ను తప్పనిసరిగా అందరూ అమలు చేయాలని చెబుతున్నప్పటికీ కిందిస్థాయి అధికారులు అమలు చేయకపోవడం శోచనీయమని విజయవాడ రీజినల్ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు అన్నారు. ఏలూరు రెవెన్యూ భవనంలో జిల్లా ఆర్టీసీ ఉద్యోగుల సంఘం విస్తృత స్థాయి కౌన్సిల్ సమావేశం జోనల్ అధ్యక్షులు ఎంఎస్‌రావు అధ్యక్షతన జరిగింది. అప్పల నాయుడు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సర్క్యులర్ ఉత్తర్వులను కిందిస్థాయి అధికారులు అమలు చేయకపోవడం వల్ల కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, విజయవాడ జోనల్ కార్యదర్శి వైవి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కెవి రాఘవులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బివిఎస్ఎస్ రంగనాయకులు, కార్యదర్శిగా రాంబాబు, కోశాధికారిగా జి. భాస్కరరావుతోపాటు మరో ఐదుగురు జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అంకితభావంతో పనిచేసే అధికారులకు గుర్తింపు



టి.నరసాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అంకితభావంతో పనిచేసే అధికారులకు గుర్తింపు ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు జయ్యవరపు శ్రీ రామ మూర్తి, శీలం వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు అడపా నాగరాజు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్. వెంకటేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా ఆయనను సతీసమేతంగా శుక్రవారం ఘనంగా సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, ఉద్యోగులు, అన్నిశాఖల అధికారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

పెదవేగి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల సంక్షేమం, ఆరోగ్యాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా పీడీ పి.శారద అన్నారు. కొత్తూరులో అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం సందర్శించారు. పిల్లలకు సంక్షేమ పథకాలు అమలును పరిశీలించారు. పిల్లల పోషణ స్థాయిని ప్రతి నెలా గమనిస్తూ, తల్లిదండ్రులకు పిల్లల ఆరోగ్య పరిస్థితిని తెలియజేయాలన్నారు. తొలుత పిల్లలను పూర్వప్రాథమిక విద్యపై ప్రశ్నించి, పిల్లల నుంచి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. పెదపాడు ప్రాజెక్టు అదనపు సీడీపీవో రాజశేఖర్, జిల్లా కార్యాలయ ఈవో వి.మల్లిక, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ఏలూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థుల కోసం జడ్పీ నిధులతో జిల్లా కామన్ పరీక్షల మండలి(డీసీఈబీ) రూపొందించి, ముద్రించిన 'విజయకేతనం' స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం జడ్పీ మీటింగ్ హాలులో జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ విడుదల చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని కొన్ని పాఠశాలల విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. ఈ స్టడీ మెటీరియల్ సుమారు 25 వేల మంది బాలబాలికలకు ఉచితంగా అందజేయనున్నట్లు వెల్లడించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, పశ్చిమగోదావరి జిల్లా డీఈవో నారాయణ, సమగ్రశిక్ష ఏపీసీ పంకజ్‌కుమార్, ఉమ్మడి జిల్లా డీవైఈవోలు రవిప్రకాష్, సేవియా, రవీంద్రభారతి, డీసీఈబీ కార్యదర్శి సర్వేశ్వరరావు, సమగ్రశిక్ష సెక్టోరల్ అధికారులు రామారావు, ఎంఈవోలు, పలు హైస్కూళ్ళ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



ఏలూరు జడ్పీ సమావేశ మందిరంలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులు

మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి దేశానికి తీరని లోటని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 1991 లో ఆర్థిక మంత్రిగా మన్మోహన్‌సింగ్ చేసిన ఆర్థిక సంస్కరణలు దేశాభివృద్ధికి బాటలు వేశాయన్నారు. ఆయన కుటుంబానికి సానుభూతి తెలిపారు. డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటని మాజీ ఎంపీ మాగంటి బాబు సంతాపం తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టానికి మన్మోహన్ కృషి చేశారన్నారు.

ఉంగుటూరు: ఆర్థిక మాంద్యం సమయంలో పలు సంస్కరణలు తీసుకు వచ్చి ప్రపంచ దేశాల్లో భారత ఖ్యాతిని మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ పెంచారని పలువురు నివాళులర్పించారు. శుక్రవారం నారాయణపురం డిగ్రీ కళాశాలలో మన్మోహన్ సింగ్ స్మారక సభను నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.కె.విశ్వేశ్వరరావు, డా.కొండా రవి, వైస్ ప్రిన్సిపాల్ రెడ్డియ్య తదితరులు మన్మోహన్‌సింగ్ చిత్ర పటం వద్ద నివాళులర్పించారు.

రిలయన్స్ ఉద్యోగుల రక్తదానం

ఏలూరు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రిలయన్స్ ఇండస్ట్రీస్ వ్యవస్థాపకుడు ధీరుభాయ్ అంబానీ జయంతి సందర్భంగా ఏలూరు ఆర్‌ఆర్ పేటలోని రిలయన్స్ సెంట్రల్ ప్లాజా వద్ద రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 27 మంది రిలయన్స్ ఉద్యోగులు రక్తదానం చేసినట్టు జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి తెలిపారు.

విద్యుత్‌ను ప్రైవేటీకరించవద్దు

టి.నరసాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యుత్‌ను ప్రైవేటపరం చేయవద్దని సీపీఎం జిల్లా నాయకుడు గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. అనంతరం వినతిపత్రాన్ని స్థానిక సచివాలయంలో అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి మడకం సుధారాణి, అనుమోలు మురళీ, మడకం కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడాలని సీఐటీయూ నాయకుడు ముజఫర్ అహ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన ఆటో డ్రైవర్ల సర్వసభ్య సమావేశానుద్దేశించి అఖిలభారత రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడాన్ని సీఐటీయూ స్వాగతిస్తుందని, అయితే జీవనోపాధి కోల్పోతున్న ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం జరిగిన ఏలూరు టౌన్ అండ్ రూరల్ ఆటో డ్రైవర్ల నూతన కమిటీ ఎన్నికల్లో అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.రాజు, బి.చంద్రశేఖర్, కోశాధికారిగా ఎం.వీర రాఘవులు, వైస్ ప్రెసిడెంట్‌గా పాపినాయుడు, పాపారావు, ఆమోస్, సహాయ కార్యదర్శులుగా రమేష్, పండు, టి.ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని యూనియన్ నాయకులు అమర్‌కుమార్, గోపి ప్రకటించారు.

కోస్టల్ బ్యాంకు వైద్య శిబిరం

చింతలపూడి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : రానున్న కాలంలో మరిన్ని శాఖలను ఏర్పాటు చేయాలని యాజమాన్యం కార్యాచరణ రూపొందిస్తోందని స్థానిక కోస్టల్ బ్యాంక్ మేనేజర్ వి.యేసుబాబు అన్నారు. శుక్రవారం బ్యాంకు సిల్వర్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా బ్యాంకు ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఖాతాదారులకు డాక్టర్ టి.దుర్గాప్రసాద్, సిబ్బంది వైద్య పరీక్షలు నిర్వహించారు. బ్యాంకు సేవలు, డిజిటల్ విధానంపై ఖాతాదారులకు వివరించారు.

పెట్టుబడి మార్కెట్లపై అవగాహన సదస్సు

ఏలూరు అర్బన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : 'పెట్టుబడులు, డిపాజిటరీ సేవలు, ఉద్యోగావకాశాలు' అనే అంశాలపై స్థానిక సీఆర్‌ఆర్ కళాశాలలో శుక్రవారం కామర్స్ విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. సీడీఎస్‌ఎల్ రీజినల్ హెడ్ వి.శివప్రసాద్ మాట్లాడుతూ మూలధన మార్కెట్లలో రకాలు, వాటిలో పెట్టుబడి నిర్వహణ, డీమ్యాట్ ఖాతా ప్రాధాన్యతలపై విద్యార్థులకు వివరించారు. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజి ఎగ్జిక్యూటివ్ కె.నాగభూషణం మాట్లాడుతూ మూలధన మార్కెట్లలో పెట్టుబడుల నిర్వహణ ద్వారా లాభాలు ఏ విధంగా సంపాదించాల న్న అంశాలపై విశ్లేషించారు. కరస్పాండెంట్లు డాక్టర్ విష్ణుమోహన్, కె.శ్రీనివాస రావు, ప్రిన్సిపాల్ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి : ఎస్పీ

ఏలూరు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పనిచేస్తున్న సివిల్ పోలీస్, ఎఆర్ పోలీస్, హోంగార్డుల సమస్యల సత్వర పరిష్కారానికి జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ శుక్రవారం ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో సంక్షేమదివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన పోలీస్ సిబ్బంది తమ సమస్యలపై వినతిపత్రాలు అందించగా ఎస్పీ వాటిని పరిశీలించి సత్వరమే పరిష్కార చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే పోలీస్ కార్యాలయ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



కేసును ఛేదించిన పోలీసులకు ప్రశంసా పత్రాలు అందజేసిన ఎస్పీ నయీం అస్మి

ఆపరేషన్ సిద్ధ

(ఐదో పేజీ తరువాయి)

శ్రీధర్‌వర్మ చేసిన అఘాయిత్యాన్ని పోలీసులు చాకచక్యంగా తెలుసుకుని 'ఆపరేషన్ సిద్ధ' పేరిట ఐదు రోజులపాటు విస్తృత తనిఖీలు చేసి చివరకు మచిలీపట్నం వద్ద అతన్ని అరెస్ట్ చేశారు. శ్రీధర్‌వర్మ, రెండో భార్య రేవతి, ప్రియురాలు సుష్మలను పోలీసులు తమదైన శైలిలో విచారించేసరికి తామే నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. తమ చుట్టూ ఇలాంటి నేరగాళ్లతో కలిసి ఉన్నామా? అని కాళ్ల, ఉండి, భీమవరం తదితర ప్రాంతాల ప్రజలు వణికిపోతున్నారు. 'మొన్నే వారితో మాట్లాడాను. వారితో కలిసి టిఫిన్ చేశాను. ఏదో సాయం అడిగితే చేశాను. నేను రోజూ చూస్తుంటాను. మా కళ్ల ముందే ఇలా వెళుతుంటారు' అంటూ వారితో పరిచయం వున్నవారు వాటిని గుర్తు చేసుకుని స్థానికులు హడలిపోతున్నారు. 'శవాలతో భయపెట్టి ఆస్తి రాయించుకోవాలని, ఇందుకోసం ఓ మనిషినే మట్టుబెట్టడం' అనే ఆలోచన వారికి ఎలా వచ్చిందో అంతుబట్టడం లేని వారు చెబుతున్నారు. అయితే శ్రీధర్‌వర్మపై గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదు. అయితే అతని అకౌంట్‌లో 15 రూపాయలు మాత్రమే ఉండడం ఆశ్చర్యపరుస్తోంది. ప్రియురాలు సుష్మ పదేళ్ల కుమార్తె పాత్ర పెద్దగా లేదని పోలీసులు నిర్ధారిస్తున్నారు. వీరి అరెస్ట్‌తో యండగండివాసులు ఒక్కసారిగా హమ్మయ్యా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అక్క ఆస్తి కోసం కుట్రపన్ని అమాయకుడిని బలి తీసుకున్న ముగ్గురు వ్యక్తులకు కఠిన శిక్ష విధించాలని.. ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ముగ్గురు నిందితులపై 252/2024 అండర్ సెక్షన్ 194 బిఎన్ఎస్ఎస్ ఆల్టర్ 2, 103, 61 (2), ఆర్/డబ్ల్యు 3 (5), బిఎన్ఎస్ కింద ఉండి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ నయీం అద్నాన్ అస్మి విలేకరులకు ఈ కేసు వివరాలను తెలిపారు. అనంతరం నిందితులు శ్రీధర్‌వర్మ, ఆయన భార్య రేవతి, సుష్మలను ఉండి పోలీసుస్టేషన్‌కు తరలించారు. అనంతరం అరెస్ట్ చూపించి భీమవరం కోర్టుకు తరలించడంతో 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు. తొమ్మిది రోజులపాటు ఎస్పీ నయీం, ఏఎస్పీ భీమారావు, డీఎస్పీ జయసూర్య, సీఐ జగదీశ్వరరావు, నాలుగు మండలాల ఎస్ఐలు కలిసి బృందాలుగా ఏర్పడి కేసులోని చిక్కుముడి ఛేదించినట్లు తెలిపారు.



ఇండోర్ స్టేడియం వద్ద ఎస్సీ నాయకుల నినాదాలు

ఏకసభ్య కమిషన్‌కు వినతుల వెల్లువ

ఎస్సీ వర్గీకరణ అనుకూల, వ్యతిరేక వర్గాలు రాక.. కలెక్టరేట్ ఎదుట నినాదాలు

ఏలూరు టూటౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా కలెక్టరేట్‌లో వినతులు స్వీకరించారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి షెడ్యూల్డ్ ఉప కులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం రంజన్ మిశ్రాను నియమించింది. ఏసభ్య కమిషన్ జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో ఎస్సీ ఉపకులాల ప్రతినిధులు, ఉద్యోగులు, న్యాయవాదులు, ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వినతుల స్వీకరణతో పాటు వారి అభిప్రాయాలను కూడా రాజీవ్ రంజన్ మిశ్రా విన్నారు. వినతులన్నిటిని పూర్తిగా పరిశీలించి నివేదిక ప్రభుత్వానికి అందిస్తామని మిశ్రా స్పష్టం చేశారు. ఉమ్మడి పశ్చిమ గోదావరిజిల్లా ఎస్సీ కులాలకు చెందిన వారు వినతులు సమర్పించారు. ఇంకా ఎవరైన వినతులు ఇవ్వనివారుంటే విజయవాడ గిరిజన సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కార్యాలయంలో అందించాలన్నారు. మెయిల్ ద్వారా వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ లోపు పంపాలన్నారు. కార్యక్రమంలో సుమారు ఎస్సీ ఉపకులాలకు చెందిన 600మంది హాజరయ్యి 132 విజ్ఞాపనలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి, జిల్లా ఎస్పీ శివకిశోర్, డీఆర్వో విశ్వేశ్వరరావు, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాశ్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉప కులాల సమాచారం ఇవ్వండి

షెడ్యూల్డ్ ఉప కులాల సమాచారాన్ని అందించాలని ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం అధికారులతో సమావేశం అయ్యారు. అధికారులకు కమిషన్ ఉద్దేశాన్ని దిశానిర్దేశం చేశారు.

పోటాపోటీగా వినతి పత్రాలు

రాజీవ్ రంజన్ మిశ్రాకు కలెక్టరేట్‌లో ఎస్సీ ఉపకులాలకు చెందిన ప్రతినిధులు, సంఘాలు, వ్యక్తులు వినతిపత్రాలు సమర్పించారు. వినతి పత్రాలు సమర్పించిన వారిలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు కందుల రమేష్, అంబేడ్కర్, పూలే వేదిక చైర్మన్ నేతల రమేష్‌బాబు, దళిత హక్కుల పోరాట అధ్యక్షుడు జుజ్జవరపు ప్రతాప్ కుమార్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబి, షెడ్యూల్ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్‌కుమార్, ఏపీ మాల ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు బేతాళ సుదర్శన్, పీవీ.సుబ్బారావు, సాయిరాజు, సుబ్బారావు, ఎస్సీ, ఎస్టీ బహుజన్ రైట్స్ సొసైటీ ప్రొటెక్షన్ అధ్యక్షులు మేతర అశోక్, వినుకొండ రామయ్య, మాలమహానాడు జాతీయ అధ్యక్షులు అలగా రవికుమార్, బహుజ నసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మత్తే కుమార్, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు ఎం.నాగరాజు, ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు కాశీవిశ్వనాధ్, రాష్ట్ర ఎంఆర్‌పీఎస్ అధ్యక్షులు ఆర్.సురేష్, బయ్యార పు రాజేశ్వరరావు తదితరులు వినతిపత్రాలు అందించారు. అనంతరం ఇండోర్ స్టేడియం వద్ద ఎస్సీలోని ఉపకులాల నాయకులు, కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేశారు. ఒకవర్గం ఎస్సీ వర్గీకరణ వద్దని, మరో వర్గం వర్గీకరణ కావాలని నినాదాలు చేశారు. పోలీసులు కలుగజేసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కుల సంఘాల నాయకులను పంపించి వేశారు. చింతల పూడి, ప్రగడవరం గ్రామాలకు చెందిన ఎంఆర్‌పీఎస్, మాలల జేఏసీ ఆధ్వ ర్యంలో విడివిడిగా తమ అభిప్రాయాలను విజ్ఞా పన పత్రాల రూపంలో చైర్మన్‌కు అందజేశారు.


పటిష్ఠ పోలీసు బందోబస్తు

ఏలూరు క్రైం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏలూరు విచ్చేసిన ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ చైర్మన్ రాజీవ్‌రంజన్ మిశ్రాకు శుక్రవారం ఎస్పీ కేపీఎస్ కిశోర్ పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలం, వ్యతిరేక వాదనలు వినతిపత్రాల రూపంలో కలెక్టరేట్‌లో ఆయన స్వీకరించిన నేపథ్యంలో కలెక్టరేట్‌కు 500 మీటర్ల దూరం నుంచి అన్ని రోడ్లను పోలీసులు దిగ్బంధం చేశారు. ముగ్గురు కంటే ఎక్కువగా గుమ్మిగూడి ఉండకుండా ముందస్తుగా ఎస్పీ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ పర్యవేక్షణలో త్రి టౌన్ సీఐ ఎస్.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అడుగడుగునా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతిపత్రాలు స్వీకరించారు. అప్పటివరకు పోలీసులు అప్రమత్తంగానే ఉన్నారు. ఎక్కడా ఎలాంటి అల్లర్లు జరుగకుండా ముందస్తుగా ఒక డీఎస్పీ, 9 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు ఇతర పోలీస్ సిబ్బంది మొత్తం 300 మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వం మారినా.. రాష్ట్రంలో అవే విధానాలు

» సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు

నరసాపురం, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం మారి ఆరు నెలలు గడుస్తున్నా.. ఇంకా గత ప్రభుత్వ విధానాలే కనిపిస్తున్నాయని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు ఆరోపించారు. పట్టణంలోని అల్లూరి సాంస్కృతిక కేంద్రంలో రెండో రోజు శుక్రవారం సీపీఎం రాష్ట్ర సమావేశాల్లో రాఘవులు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను పక్కనబెట్టి ఢిల్లీలో మోదీ, బీజేపీ పెద్దలకు కూటమి నేతలు జీహూజుర్ అంటూ భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ విధానాలను డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ భుజాన వేసుకుని సనాతన ధర్మం అంటూ రోడ్డెక్కడం సిగ్గుచేటన్నారు. ఇలాంటి ధోరణిలతో సమాజాన్ని పవన్ ఎటువైపు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారో చెప్పాలన్నారు. గత ప్రభుత్వంపై అనేక విమర్శలు చేసిన సీఎం చంద్రబాబు నేడు అవే విధానాలను అమలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై రూ.1600 కోట్ల భారం మోపిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్ర రహదార్ల పెట్టి టోల్‌గేట్‌లు పెట్టి ఎడా పెడా దోచుకునేందుకు రంగం సిద్ధం చేసిందన్నా రు. పేరుకే ఉచిత ఇసుక అని భారీగా ధర పెరిగిపోయిందన్నారు.



గోపవరం ఫిషర్‌మేన్ కోఆపరేటివ్ సొసైటీకి ఏకగ్రీవంగా ఎన్నికైన సభ్యులు



అల్లూరు ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షుడికి నియామక పత్రం అందజేస్తున్న అధికారి

ఉత్కంఠగా ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

» గోపవరంలో ఉద్రిక్తత

» చివరికి ఏకగ్రీవంగా ఎన్నికైన టీడీపీ నాయకులు

కైకలూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): గోపవరం ఫిషర్‌మేన్ కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు ఉత్కంఠభరితంగా జరిగాయి. గోపవరం పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. సొసైటీలో 94 మంది సభ్యులుండగా గత రెండు రోజులుగా వైసీపీకి చెందిన నాయకులు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ సొసైటీ అధ్యక్ష పదవిని చేజిక్కించుకునేలా ప్రయత్నాలు చేశారు. అయితే గ్రామ టీడీపీ సీనియర్ నాయకుడు ఆలూరి రాజేష్‌కుమార్ చాకచక్యంగా 68 మంది సభ్యులతో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమయిన తర్వాత ఏడుగురు వైసీపీకి చెందిన వారు నామినేషన్ వేశారు. అప్పటికే సంఖ్యాబలంలో తెలుగుదేశం పార్టీకి చెందిన సభ్యులు ఎక్కువమంది ఉండడంతో ఇరువర్గాల మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఈ సమాచారం తెలుసుకున్న టౌన్ సీఐ కృష్ణ, ఎస్సై వెంకటకుమార్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు ఏర్పాటుచేశారు. టీడీపీకి చెందిన సభ్యులు ఎక్కువమంది ఉండడంతో వైసీపీకి చెందిన వారు ధరావత్తు చెల్లించకుండా ఎన్నికల నుంచి తప్పుకోవడంతో ఎన్నికల అధికారి నూజివీడు మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సతీష్‌కుమార్ వారి నామినేషన్లు తిరస్కరించిన ట్లు తెలిపారు. టీడీపీకి చెందిన 9మందే డైరెక్టర్లు నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో కోఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్‌గా కూరెళ్ళ శంకరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా నాగనబోయిన రమేష్, సెక్రటరీగా పోలవరపు వెంకట సుబ్బారావును ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు సొసైటీ సభ్యులను వెల్లడించడంతో టీడీపీ శ్రేణులు ఉత్సాహంతో బాణసంచా కాల్చి గ్రామంలో ర్యాలీ చేశారు. గ్రామ టీడీపీ నాయకుడు ఆలూరి రాజేష్ కుమారి, సొసైటీ సభ్యులను సత్కరించారు.

అల్లూరు ఫిషర్‌మెన్ సొసైటీ పరిధిలో..

ముదినేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అల్లూరు ఫిషర్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడిగా పత్తి సోమేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా నక్కా ఏసుపాదం, కార్యదర్శిగా సింగరాతి యెర్ని అప్పారావు నియమితులయ్యారు. అల్లూరులో శుక్రవారం జరిగిన సొసైటీ సభ్యుల సమావేశంలో ఫిషరీష్ శాఖ అధికారి గణపతి వీరికి నియామక పత్రాలు అందజేశారు.

కొండంగిలో 210 అర్జీలు

కలిదిండి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొండంగిలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలపై 210 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. భూ సమస్యల పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకుంటామన్నారు. సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, ఎంపీటీసీ లక్ష్మణరావు, డీసీ చైర్మన్ ఎం.భోగేశ్వరరావు, నీటి సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్, ఆర్ఐ శ్యామల, సర్వేయర్ షమీ, వీఆర్వోలు పాల్గొన్నారు.

గుండెపోటుతో హైస్కూల్ లైబ్రరీ అసిస్టెంట్ మృతి



మండవల్లి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లైబ్రరీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎల్.నాగమల్లేశ్వరరావు శుక్రవారం ఉదయం గుండెపోటుతో చెందారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి ఇటీవల తీర్థయాత్రలకు వెళ్లగా పూరీలో ఉదయం మృతి చెందారని బంధువులు తెలిపారు. మండవల్లి హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్, పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్థులు నివాళులర్పించారు.



నూతనంగా ఎన్నికైన వీఆర్వోల సంఘం సభ్యులను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు

వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్

కైకలూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ అధ్యక్షుడిగా కోకా చంద్రశేఖర్‌ను ఎన్నుకున్నారు. శుక్రవారం కైకలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్వోల సంఘం సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జాయింట్ సెక్రటరీ బీఆర్ సుబ్బారావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. వైస్ ప్రెసిడెంట్‌గా కైకలూరు-1 వీఆర్వో రంగనాయకమ్మ, సెక్రటరీగా భుజబలపట్నం వీఆర్వో జీవీ ప్రసాదరావు, ట్రెజరర్‌గా తామరకొల్లు వీఆర్వో పి.రాజబాబు, జాయింట్ సెక్రటరీగా కైకలూరు-4 వీఆర్వో ఎస్.సాయికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీఆర్వోల సంఘం ఎన్నికల పట్ల ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం సంఘ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

బాల్యవివాహాలు నేరం

కైకలూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఎక్కడైనా జరుగుతున్నట్టు తెలిస్తే అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని కైకలూరు సీనియర్ సివిల్‌జడ్జి వీవీఎస్‌వి లక్ష్మీ అన్నారు. కైకలూరు విద్యాంజలి విద్యాసంస్థల్లో శుక్రవారం విద్యార్థులకు బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణ అంశాలపై న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను పంపిణీ చేశారు. న్యాయవాది పవన్ కాంత్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ జమీల్ అహ్మద్ పాల్గొన్నారు.



భూపతి అశోక్‌కు అభినందనలు తెలుపుతున్న నాయకులు

మాలమహానాడు అధ్యక్షుడిగా భూపతి అశోక్ ఎన్నిక

కలిదిండి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల మాల మహానాడు అధ్యక్షుడిగా భూపతి అశోక్ ఎన్నికయ్యారు. కొచ్చెర్లలో శుక్రవారం నిర్వహించిన మాలమహానాడు సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షుడు సేవా నాగ జగన్ బాబురావు, రాష్ట్ర అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్, నియోజకవర్గ మాలమహానాడు ఉపాధ్యక్షుడు జోజిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదిశైవ అర్చక సంఘం జిల్లా సహాయకార్యదర్శిగా శంకరశాస్త్రి

కైకలూరు, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆదిశైవ అర్చక సంఘం ఏలూరు జిల్లా సహాయక కార్యదర్శిగా కైకలూరుకు చెందిన చావలి శంకరశాస్త్రిని నియమించారు. ద్వారకా తిరుమలలో ఆంధ్రరాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘం సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మురమళ్ళ రాంబాబు శంకరశాస్త్రీకి నియామకపత్రాన్ని అందజేశారు. అలాగే కైకలూరు నియోజకవర్గం నుండి కార్యదర్శులగా నియమితులైన గూడూరి శ్రీనివాసు, చాగంటిపాటి రుద్రాకరచక్రవర్తిశర్మ, రుద్రపాక బాపూజీ శర్మ, ఐలూరి తారకరామకృష్ణ ప్రమాణస్వీకారం చేశారు.



రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియాను సత్కరిస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు శోభనాద్రి చౌదరి

సిసోడియాకు సన్మానం

ముదినేపల్లి, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ప్రభుత్వ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి.సిసోడియాతోపాటు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, జేసీ ధాత్రిరెడ్డి, ఆర్డీవో అంబరీష్‌లను మండల టీడీపీ అధ్యక్షులు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి శాలువాలు కప్పి సత్కరించారు. జేసీ ధాత్రిరెడ్డి రెవెన్యూశాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకు జ్ఞాపికను అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొత్తా నాగేంద్ర కుమార్, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జగన్మోహనరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మృతి పట్ల జరిగిన రెవెన్యూ సదస్సులో సంతాపం ప్రకటించారు.

కైకలూరులో ప్రత్యేక సెల్ : ఎమ్మెల్యే

భూములకు సంబంధించిన రెవెన్యూ, తదితర శాఖల ద్వారా సమస్యలను పరిష్కరించేందుకు కైకలూరు తన కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ప్రకటించారు. పెదపాలపర్ర రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని వారు తమ భూ సమస్యలపై అర్జీలను తన కార్యాలయంలో నిత్యం అందజేయవచ్చన్నారు.

బొబ్బర తెగులు నివారించాలి

ముసునూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మిరప పంటకు బొబ్బర తెగులు ఆశించకుండా రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన అధికారిణి కె.జ్యోతి ప్రియాంక అన్నారు. శుక్రువారం గుళ్ళపూడి, వలసపల్లి గ్రామాల్లో మిరప పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా హెచ్‌వో మాట్లాడుతూ ప్రతి ఏడాది పంట మార్పిడి చేపట్టాన్నారు. పచ్చిరొట్ట ఎరువులను జూన్ మాసంలో వేసుకుని పూతదశలో కలియదున్నాలన్నారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని అన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులు

ముసునూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేల్పుచర్ల జడ్పీపాఠశాలలో గత ఏడాది పదవ తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు శుక్రవారం నగదు పోత్సాహక బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన డి.షణ్ముఖ వెంకటసాయికి రూ.2500, ద్వితీయలో నిలిచిన పి.నాగరాజుకు రూ.2000, తృతీయ సాధించిన పి.షణ్ముఖప్రియాకు రూ.1500 చొప్పున చొప్పున అందజేశారు. ఇదే పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న కెవి నారాయణరావు, భార్యా దుర్గారాణి అందజేశారు. హెచ్‌ఎం ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

నూజివీడు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):నూజివీడు పట్టణంలోని ఓ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. సమతానగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగి సూరపనేని జగన్నాథరావు బెంగళూరులోని తమ కుమారుల ఇంటికి వెళ్ళాడు. ఈ క్రమంలో ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని పసిగట్టిన దొంగలు ఇంటి తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడ్డాడు. ఇంటివద్ద పనికివచ్చిన పనిమనిషి ఇంటితాళాలు పగులకొట్టి ఉండటాన్ని గమనించి చుట్టుపక్కల వారికి చెప్పడంతో నూజివీడు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. అయితే ఇంట్లో ఏమిపోయాయి అనేది యజమాని వస్తేగాని తెలియదు. నూజివీడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

చాట్రాయి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పర్వతాపురం, బూరుగ్గూడెం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ గీత అర్జీలు స్వీకరించారు. మొత్తం 6 అర్జీలు వచ్చినట్లు అధికారులు చెప్పారు. టీడీపీ నాయకులు బొర్రా నాగేశ్వరరావు, చెన్నారావు, మిద్దె సత్యనారాయణ, మల్లికార్జున, దిలీప్ పాల్గొన్నారు.

తమ్మిలేరు ప్రాజెక్టుకు మరమ్మతు పనులు చేద్దాం

చాట్రాయి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఆయకట్టు రైతులు, నీటి సంఘాలు, అధికారులు సమన్వయంతో తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులు పూర్తి చేద్దామని తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు యర్రా రమేశ్, ఉపాధ్యక్షుడు గుండా వెంకన్న అన్నారు. టీఆర్‌పీ రెగ్యులేటర్ వద్ద సెక్షన్ ఆఫీస్‌లో శుక్రవారం ప్రాజెక్టు కమిటీ తొలి సమావేశం జరిగింది. జైకా నిధులతో తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతులపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. యడవల్లి నీటి సంఘం అధ్యక్షుడు చెలికాని కృష్ణారావు, యర్రంపల్లి నీటి సంఘం అధ్యక్షుడు భక్తవత్సలరెడ్డి, చాట్రాయి నీటి సంఘం అధ్యక్షుడు వెల్ది అప్పారావు, టీడీపీ నాయకులు మరిడి చిట్టిబాబు, వెల్ది రాజారావు, బొలినేని మధు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధ్యక్షుడు యర్రా రమేశ్

విద్యుత్ చార్జీలు తగ్గించాలని వైసీపీ ప్రదర్శన



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

నూజివీడు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్‌ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వైసీపీ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ద్వారకా ఎస్టేట్ వద్ద మాజీ ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెంచే విద్యుత్‌ఛార్జీలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం ర్యాలీగా విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు నిరసన ప్రదర్శన చేశాయి.

కోస్టల్ బ్యాంకులో సిల్వర్‌జూబ్లీ వేడుకలు



సీనియర్ ఖాతాదారుడిని సన్మానిస్తున్న దృశ్యం

నూజివీడు, డిసెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): కోస్టల్‌బ్యాంకు సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నూజ వీడు బ్రాంచిలో మేనేజరు కృష్ణప్రసాద్ సీనియర్ ఖాతాదారులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్యాంకు డిపాజిట్లపై నెలకు రూ.8.25, సీనియర్ సిటీజన్లకు రూ.8.75 వడ్డీ అందిస్తున్నట్లు తెలిపారు.

మన్మోహన్‌కు నివాళులు

నూజివీడు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతిపట్ల నూజివీడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ తీవ్ర సంతాపాన్ని తెలియచేసింది. నూజివీడు కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో నాయకులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పరిమి సాగర్‌కుమార్, బి.డి రవికుమార్, కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగభరత్ పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన

నూజివీడు టౌన్, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి):ఎల్ఐజీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎల్ఐఏఎఫ్ఐ ఆధ్వర్యంలో నూజివీడు ఎల్ఐసీ బ్రాంచ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ఐఏఎఫ్ఐ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలని రెండురోజుల పాటు నాన్ కోఆపరేషన్ విధానాన్ని ఉంటుందని తెలిపారు.

30న మండల సమావేశం

చాట్రాయి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండల సమావేశం ఈనెల 30వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

మొక్కజొన్న ఈక్రాప్ చేయించుకోండి

చాట్రాయి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): రబీ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించుకోవాలని ఏవో శివశంకర్ కోరారు. చాట్రాయిలో శుక్రవారం ఈక్రాప్ నమోదును ఏవో పరిశీలించి మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాలలో పంట వివరాలు తెలిపి రకాల వారీగా ఈక్రాప్ చేయించుకోవాలని అన్నారు. ఈక్రాప్ నమోదు వలన మద్దతు ధర, ఇన్సూరెన్స్, రుణాలు, పంట నష్ట పరిహారం, కౌలు రైతు కార్డులు తదితర సదుపాయాలు పొందవచ్చునని అన్నారు.

కాలినడకన ద్వారకాతిరుమలకు..

చాట్రాయి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట నుంచి 25 మంది మహిళా భక్తుల బృందం చాట్రాయి మీదుగా కాలినడకన శుక్రవారం ద్వారకాతిరుమల చిన్న వెంకన్న దర్శనానికి వెళ్ళారు. తమ కుటుంబాలను చల్లగా చూస్తే కాలినడకన వెంకన్న దర్శనానికి వస్తామని మొక్కుకున్నామని, శనివారం ఉదయం స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటామని చెప్పారు.

యువతి ఇంటి ముందు తెలంగాణ కానిస్టేబుల్ హల్‌చల్

చాట్రాయి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): మండలంలో నరసింహారావుపాలెంలో గురువారం రాత్రి ఓ యువతి ఇంటి ముందు తెలంగాణ పోలీస్ కానిస్టేబుల్ పూరేటి నాగరాజు హల్‌చల్ కలకలం సృష్టించింది. సమాచారం అందటంతో నాగరాజును అదుపులోకి కేసు నమోదు చేశామని చాట్రాయి ఎస్సై రామకృష్ణ చెప్పారు. వివరాల ప్రకారం తెలంగాణ పరిధిలోని వేంసూరు మండలం లచ్చన్నగూడెంకు చెందిన పూరేటి నాగరాజు హైదరాబాద్ తెంగాణ సచివాలయంలో పోలీస్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతనికి భార్య పిల్లలు ఉన్నారు. నరసింహారావుపాలెంకు చెందిన యువతితో నాగరాజుకు కొద్ది కాలం క్రితం పరిచయం ఏర్పడింది. ఈ విషయం యువతి తల్లిదండ్రులకు తెలియటంతో పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువెళటంతో నాగరాజును మందలించారు. ఈ నేపధ్యంలో నాగరాజు గురువారం రాత్రి నరసింహారావుపాలెం వచ్చి పెళ్ళి చేసుకుంటానని యువతిని తీసుకువెళతుండగా యువతి తల్లిదండ్రులు గ్రామస్తులు అడ్డుకున్నారు. దీనితో నాగరాజు కత్తితో బెదిరించి యువతిని తనతో తీసుకువెళ్ళటానికి ప్రయత్నం చేయటంతో గ్రామస్తులు అతణ్ణి పట్టుకొని తాళ్ళతో కట్టేసి చాట్రాయి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చికిత్స పొందుతూ మృతి

ముసునూరు, డిసెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెక్కపల్లి గ్రామానికి చెందిన మానికల వంశీ (28) కొన్నినెలలుగా కడుపునొప్పితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన భరించలేని కడుపునొప్పి రావడంతో ఇంటిలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విజయవాడ ప్రభుత్వ ఆసుప త్రిలో చికిత్స పొందుతూ వంశీ మృతి చెందాడు. దీనిపై ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

ఎక్సైజ్‌దాడుల్లో ఇద్దరి అరెస్టు

చాట్రాయి, డిసెంబరు 27(ఆంధ్రజ్యోతి): పోతనపల్లిలో శుక్రవారం సారా రవాణా చేస్తున్న పర్వతాపురంకు చెందిన చొప్పరపు అప్పారావు, నరసింహారావులను అరెస్ట్ చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. నేర స్థలం నుంచి పారిపోయిన పోతనపల్లికి చెందిన దరావత్తు శ్రీరాములుపై కేసు నమోదు చేశామని తెలిపారు.